Follow: @ANNTELUGU

29-10-2026

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 262 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు

**క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి**

- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి
- తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

03

టాప్ న్యూస్

### కాంగ్రెస్ ఎన్నిసీట్లు గెలిచింది?

- ఎమ్మెల్సీ ఎన్నికలపై మోదీ సెటైర్
- బ్యాలెట్ అయినా ఓడారుగా



02

### మోదీ సీటులో ఎస్పీ పాగా

వారణాసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్పీ విజయం



02

### ఓటు ఉన్నోళ్ళకు మళ్లీ ఫామ్ 6 ఎంటీ

- అసలు బుర్ర వాడారా..?
- ఈసీపై సుప్రీంకోర్టు ఫైర్



03

# మొయినాబాద్‌లో జీవో 111కు తూట్లు..!

అనుమతులు లేకుండానే యథేచ్ఛగా కొనసాగుతున్న భారీ షెడ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు ...!

హోటళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, వ్యాపార సముదాయాల కోసం నిబంధనలను బొందపెట్టి బహుళ అంతస్తుల నిర్మాణాలు..!

- సెట్‌బ్యాక్‌లు, ఫైర్ సేఫ్టీ మచ్చుకైనా కనిపించని వైనం..!
- కాగితాలకే పరిమితమైన ప్రభుత్వ ఆంక్షలు...!
- అంతా మున్సిపల్ కమిషనర్ కనుసన్నల్లోనే ...!
- అదే బాటలో భారీగా వసూళ్లకు తెగబడుతున్న కొందరు కౌన్సిలర్లు...!
- ఒక్కో అక్రమ నిర్మాణానికి చదరపు అడుగుల చొప్పన వసూళ్లు...!
- డమ్మీగా మారిన పట్టణ ప్రణాళిక విభాగం...!
- చర్యలు తీసుకోవడానికి జంకుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు...!
- తనిఖీలు లేకపోవడంతో రెచ్చిపోతున్న అక్రమార్కులు...!
- నిబంధనల అమలులో అధికారుల వైఫల్యం...!
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న ఇంటి దొంగలు ...!
- ఉన్నతాధికారులు స్పందించాలంటున్న స్థానికులు...!

రాజధాని నగర దాహార్తిని తీర్చి, పర్యావరణ పరిరక్షణకు రక్షణ కవచంగా నిలిచిన చారిత్రాత్మక ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల ఉనికికే ముప్పు వాటిల్లుతోంది.. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన 'జీవో 111' లక్ష్యాలను అధికారులు తుంగలో తొక్కుతున్నారు.. మొయినాబాద్ మండలం మొత్తం ఈ జీవో పరిధిలోకి వస్తున్నప్పటికీ, అక్రమార్కులు నిబంధనలను బొందపెట్టి పెట్రేగిపోతున్నారు.. కనీస అనుమతులు లేకుండానే భారీ షెడ్లు, గోదాములు, బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు, హాస్టళ్లు, హోటళ్లు వెలుస్తున్నా అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం జంట జలాశయాల పరిరక్షణను గాలికొదిలేసి, అక్రమార్కుల కోట్లాది రూపాయల లాభాపేక్షకు అధికారులు వత్తాసు పలుకుతున్నారనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి..అక్రమ నిర్మాణాలను ఆదిలోనే అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ యంత్రాంగం డమ్మీగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ కనుసన్నల్లోనే ఈ అక్రమ సామ్రాజ్యం నడుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు..భారీగా ముడుపులు ముడుపులు ముట్టడంతో ఈ అక్రమ నిర్మాణాల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి.. అదే బాటలో కొందరు స్థానిక కౌన్సిలర్లు సైతం ఒక్కో అక్రమ నిర్మాణం నుండి చదరపు అడుగుల చొప్పన రేట్లు ఫిక్స్ చేసి భారీగా వసూళ్లకు తెగబడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి..ఇంటి దొంగలే ఈ అక్రమాలకు సూత్ర, పాత్ర ధారులుగా మారడంతో ఒకవైపు జలాశయాల ఉనికి ప్రమాదంలో పడటమే కాకుండా, మరోవైపు ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి భారీగా గండి పడుతోంది స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

02







## ఛలో ఢిల్లీ

- 119 నియోజకవర్గాల నుండి 10వేల మంది
- తెలంగాణ కాంగ్రెస్ ఫుల్ ఫోకస్
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

**హైదరాబాద్, మహా :** 'ఓట్ బచావో దేశ్ బచావో' నినాదంతో ఢిల్లీ వేదికగా జరిగే మెగా ర్యాలీకి తెలంగాణ కాంగ్రెస్ సిద్ధమైంది. నవంబర్ 1న రాహుల్‌గాంధీ నేతృత్వంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల నుంచి దాదాపు 10 వేల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు

మిగతా 6వ పేజీలో



## ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించటమే లక్ష్యంగా పనిచేశాం

- తుఫాన్ నష్టంపై కేంద్రానికి నేడు ప్రాథమిక నివేదిక
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, మహా :** అర్నబ్ తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తూ, మూడు రోజుల్లో ఏడు సమీక్షలు నిర్వహించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా తుఫాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించామని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రభుత్వం విశ్రాంతి తీసుకోదని స్పష్టం చేశారు.

మిగతా 6వ పేజీలో



## శ్రీమతి తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ

మహిళల కోసం గ్రాండ్ ఈవెంట్

02



## మిల్లర్ల గుండెల్లో గుబులు

- ఆరుగురి అరెస్టుతో ములుగు జిల్లాలో కలకలం!
- అధ్యక్షులు సతీష్ పేరుతో వైరలవుతున్న చరవాణి సందేశం
- సీఐడీ వ్యూహం పై రైస్ మిల్లర్ల అసోసియేషన్‌లో ఉత్కంఠ

05











# మోదీ సీటులో ఎస్పీ పాగా

**వారణాసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్పీ విజయం**

**వారణాసి :** ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి షాక్ తగిలింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గం సీటులో ఎస్పీ విజయం సాధించింది. అంతేకాకుండా ఆగ్రాలోని గెలుపొందింది. 5 గ్రాడ్యుయేట్, 6 టీచర్ నియోజకవర్గాలకు ఈనెల 23న పోలింగ్ నిర్వహించగా.. ఓట్ల లెక్కింపు బుధవారం ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 4 సీట్లను నిలబెట్టుకుంది. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రెండు చోట్ల విజయం సాధించింది. బీజేపీ నిలబెట్టుకున్న స్థానాల్లో మీరట్, బరేలీమొరాదాబాద్ టీచర్ల సీటు, లక్నో టీచర్స్ సీటు ఉన్నాయి. వారణాసి, ఆగ్రా టీచర్ల నియోజకవర్గాల్లో ఎస్పీ గెలుపొందింది. మొత్తం 11 ఎమ్మెల్సీ సీట్లకు బుధవారం లెక్కింపు ప్రారంభించారు. మీరట్ సహరన్‌పూర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో బీజేపీ సిటింగ్ ఎమ్మెల్సీ దినేష్ గోయల్ గెలుపొందారు. ఎస్పీ అభ్యర్థి ప్రమోద్ సింగ్ భాటీపై 12,855 ఓట్లతో గోయల్ గెలుపొందారు. మీరట్ టీచర్ల నియోజకవర్గంలో ఎస్పీ అభ్యర్థి నితిన్ తోమర్‌పై బీజేపీ అభ్యర్థి శ్రీచంద్ శర్మ 13,241 ఓట్లతో విజయం సాధించారు. బరేలీమొరాదాబాద్ టీచర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి హరి సింగ్ ధిల్లాన్.. ఎస్పీ అభ్యర్థి హాజీ మొహమ్మద్ దానిష్ అక్తర్‌ను ఓడించారు. లక్నో టీచర్ నియోజకవర్గంలో సిటింగ్ బీజేపీ అభ్యర్థి ఉమేష్ ద్వివేదీ.. ఎస్పీ అభ్యర్థి సుశీల్ కుమార్‌పై గెలుపొందారు. కాగా.. వారణాసి టీచర్ నియోజకవర్గంలో ఎస్పీ సిటింగ్ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్.. బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాను 4900 ఓట్ల తేడాతో ఓడించారు. ఆగ్రా టీచర్ నియోజకవర్గంలో ఎస్పీ అభ్యర్థి ఆకాశ్ అగర్వాల్.. బీజేపీ అభ్యర్థి హరికిశోర్ తివారీపై విజయం సాధించారు. కాగా.. 5 గ్రాడ్యుయేట్, 6 టీచర్ నియోజకవర్గాలకు ఈనెల 23న పోలింగ్ నిర్వహించారు. 11 సీట్లలో 6 సీట్ల ఫలితాలు తేలగా.. మిగతా చోట్ల కౌంటింగ్ కొనసాగుతోంది

# కాంగ్రెస్ ఎన్నిసీట్లు గెలిచింది?

**ఎమ్మెల్సీ ఎన్నికలపై మోదీ సెటైర్ బ్యాలెట్ అయినా ఓడారుగా**

**ఢిల్లీ, మహా :** కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాని మోదీ స్పందించారు. ఈ నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కకపోవడంతో ఆయన సోషల్ మీడియా యాప్ ఎక్స్ వేదికగా సెటైర్ వేశారు. 'బ్యాలెట్ పేపర్‌తో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నిసీట్లు గెలిచింది..?' అంటూ ప్రధాని చురకలంటించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎమ్) ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్‌లతో మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని గత కొంతకాలంగా కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో బ్యాలెట్ పేపర్‌తో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నిసీట్లు సాధించిందంటూ మోదీ ఎద్దేవా చేశారు. యూపీ, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక బిహార్ వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయని మోదీ రాసుకొచ్చారు. అవన్నీ కూడా ప్రతిపక్షాలు కోరుకుంటున్నట్లు బ్యాలెట్ పద్ధతిలోనే జరిగాయని గుర్తుచేశారు. యూపీలో మొత్తం ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగగా నాలుగు చోట్ల బీజేపీ, రెండు చోట్ల ఎస్పీ విజయం సాధించాయి. బిహార్ లో మొత్తం నాలుగు చోట్ల ఎన్నికలు జరగగా ఇక్కడ ప్రశాంత్ కిశోర్ నేతృత్వంతో ని జన్ సూరజ్ పార్టీ తొలిసారి శాసనమండలి ఖాతా తొరిచింది. జన్ సూరజ్, ఆర్జేడీ, బీజేపీ, ఇండిపెండట్ ఒకరు విజయం సాధించారు. కర్ణాటకలో నాలుగు స్థానాలుక ఎన్నికలు జరగగా జేడీఎస్ ఒకటి, బీజేపీ మూడు చోట్ల విజయం సాధించాయి. ఇక మహారాష్ట్రలో ఐదు స్థానాల్లో బీజేపీ రెండు శివసేన ఒకటి, ఎన్సీపీ (ఎస్పీ) రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి.



# మొయినాబాద్‌లో జీవో 111 కు తూట్లు..!

**మహా, సిటీ బ్యూరో :** రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మున్సిపాలిటీ, అజీజ్ నగర్, హిమాయత్ నగర్, యెంకేపల్లి పరిధిలో అక్రమ నిర్మాణాలకు హద్దూ, అదుపూ లేకుండా పోతోంది. పర్యావరణ పరిరక్షణ చట్టాలను, ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తూ, జీవో 111 ఎంఎ కి తూట్లు పొడుస్తూ అధికార యంత్రాంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని కొందరు బిల్డర్లు కోట్ల రూపాయల ధనార్జనే ధ్యేయంగా అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మిస్తున్నారు. మొయినాబాద్ మండలం మొత్తం పూర్తిగా 111 జీవో పరిధిలో ఉన్నప్పటికీ, ఎలాంటి పర్యావరణ, మున్సిపల్ అనుమతులు లేకుండానే యదేచ్ఛగా భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు, షెడ్లు నిర్మించి , ఫంక్షన్ హల్స్, హోటల్స్, హాస్టల్స్ కోసం సన్నాహాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుంచి హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించడంతో పాటు ఈ జలాశయాల పరివాహక ప్రాంతాలను కాలుష్యం, అనియంత్రిత పట్టణీకరణ నుంచి కాపాడేందుకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెం.111 ఎం.ఎ ను జారీ చేసింది. 1993 మార్చి 30 న ఆనాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి. అర్జున్‌రావు ఆధ్వర్యంలో రూపొందిన ఈ ఉత్తర్వుల్లో జంట జలాశయాల పరివాహక ప్రాంతాల్లో అభివృద్ధి, నిర్మాణ కార్యకలాపాలపై పలు నియంత్రణలు విధించారు. జలాశయాలకు సుమారు 10 కిలోమీటర్ల పరిధిలోని 84 గ్రామాల్లో ఎలాంటి లేఅవుట్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, చెక్ డ్యామ్ లు, కాంక్రీట్ వాల్స్ చేపట్టకూడదనే నిషేధాజ్ఞలను తుంగలో తొక్కి రియల్ మాఫియా పెట్రేగి పోతోంది. లేఅవుట్లు, భారీ నిర్మాణాలు, కాలుష్యకారక పరిశ్రమలు తదితర కార్యకలాపాలను నియంత్రించడం ద్వారా జలాశయాల్లోకి చేరే నీటి నాణ్యతను కాపాడటం, వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడటం, భవిష్యత్‌లో హైదరాబాద్ నగరానికి తాగునీటి కొరత ఏర్పడకుండా జల వనరులను పరిరక్షించడమే జీవో 111 ప్రధాన ఉద్దేశ్యంగా జారీ చేశారు. ఈ నిబంధనల అమలు కోసం ప్రత్యేకంగా నియంత్రిత ప్రాంతాలను గుర్తించి భూమి వినియోగం, లేఅవుట్లు, నిర్మాణాలు తదితర అంశాలపై ఆంక్షలు విధించారు. అయితే ప్రస్తుతం మొయినాబాద్ పరిసర ప్రాంతాల్లో జీవో 111 ఎం.ఎ నిబంధనలను బేఖాతరు చేస్తూ భారీ షెడ్లు, వాణిజ్య సముదాయాలు, బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తుండటంతో అసలు ప్రభుత్వ ఆంక్షలు అమలవుతున్నాయా? లేక కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వివరాలలోకి వెళ్తే...

**జె బి ఐ టి కాలేజీ ఎదురుగా పదుల సంఖ్యలో బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలు :**

మొయినాబాద్ మండలం ఎంకెపల్లి జె బి ఐ టి ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా పదుల సంఖ్యలో హాస్టల్ కోసం విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు, సెట్ బ్యాక్ లు, ఫైర్ సేఫ్టీ లేకుండా సెల్లార్ తో పాటు ఆరు నుంచి ఏడు ఫ్లోర్ల వరకు బహుళ అంతస్థుల నిర్మాణాలు వెలుస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. జీఓ 111 ఎం.ఎ నిబంధనలు అమల్లో ఉన్న ప్రాంతంలోనే నిబంధనలను బేఖాతరు చేస్తూ నిర్మాణం సాగుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


జె బి ఐ టి కాలేజీ ఎదురుగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణం


జె బి ఐ టి కాలేజీ ఎదురుగా కొనసాగుతున్న మరో అక్రమ నిర్మాణం


జె బి ఐ టి కాలేజీ ఎదురుగా కొనసాగుతున్న భారీ అక్రమ నిర్మాణం

ఇంత భారీ స్థాయిలో పనులు జరుగుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారని దీనికి కారణం ఓ వైపు మున్సిపల్ కమీషనర్, మరోవైపు కొందరు కౌన్సిలర్ల వత్తిళ్లేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అజీజ్ నగర్, హిమాయత్ నగర్ లో అంతులేని అక్రమ నిర్మాణాలు**

అజీజ్ నగర్, హిమాయత్ నగర్ లో హాస్టల్స్, హోటల్స్, ఫంక్షన్ హాల్స్, వాణిజ్య కార్యకలాపాల కోసం అంతులేని అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అజీజ్ నగర్ వి జె ఐ టి కాలేజ్ ఎదురుగా.. ప్రధాన రహదారి పక్కన రెండు భారీ షెడ్లు, మున్సిపల్ ఆఫీసుకి వెళ్లే దారిలో మరో షెడ్డు, చిలుకూరు బాలాజీ టెంపుల్ కి వెళ్లే దారిలో ఫంక్షన్ హల్స్ కోసం మరో రెండు భారీ షెడ్లు, మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పక్కన ఓ భారీ షెడ్డు నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వాణిజ్య సముదాయాల కోసం నిర్మిస్తున్న ఈ షెడ్లకు సంబంధించి ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండా యధేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి పక్కనే అక్రమ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అంతా మున్సిపల్ కమమిషనర్ కనుసన్నల్లోనే...!**

మున్సిపల్ పరిధిలో నిర్మాణ అనుమతుల పరిశీలన, క్షేత్రస్థాయి తనిఖీలు, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం అధికార యంత్రాంగం బాధ్యత. అయితే అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ వాటిని పరిశీలించి చర్యలు తీసుకున్న వివరాలు బహిర్గతం కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల సహకారం లేకుండా అక్రమ నిర్మాణాలు ఇంత పెద్ద ఎత్తున కొనసాగడం సాధ్యమేనా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక మున్సిపల్ కమిషనర్ కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాల వ్యవహారం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీగా ముడుపులు ముట్టడంతోనే అటువైపు కన్నెత్తి చూడటం లేదని, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా అటువైపు వెళ్లొద్దని హుకుం జారీ చేస్తున్నారని స్థానికులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి..!**

మొయినాబాద్ పరిధిలో సాగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం కేవలం పర్యావరణానికే కాకుండా ప్రభుత్వ ఖజానాకు కూడా పెద్ద ఎత్తున కోలుకోలేని దెబ్బతీస్తోందని, కొందరు "ఇంటి దొంగల" అవినీతి దందా వల్ల ఒకవైపు జీవో 111 పరిధిలోని జంట జలాశయాల ఉనికికి, పర్యావరణ సమతుల్యతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుండగా... మరోవైపు ప్రభుత్వ రాబడికి భారీగా గండి పడుతోందని స్థానికులు మండిపడుతున్నారు.

సక్రమ పద్ధతిలో నిర్మాణాలు చేపడితే నిబంధనల ప్రకారం పురపాలక శాఖ (మున్సిపాలిటీ) కి ప్లాన్ అప్రూవల్ ఫీజులు, లేఅవుట్ ఛార్జీలు, భూ వినియోగ మార్పిడి రుసుములు, వార్షిక భవన పన్నుల రూపంలో రూ.కోట్ల ఆదాయం సమకూరాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు.కానీ, ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే బహుళ అంతస్తులు, భారీ షెడ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించేస్తుండటంతో ఈ ఆదాయమంతా ప్రభుత్వానికి రాకుండా పోతోందని, ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల రాబడి, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల (కొందరు కౌన్సిలర్ల) వ్యక్తిగత జేబుల్లోకి ముడుపుల రూపంలో వెళ్లిపోతోందనేది క్షేత్రస్థాయిలో బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలంటున్న స్థానికులు!**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జీఓ 111 ఉల్లంఘనలు, బహుళ అంతస్తులు, భారీ షెడ్ల అక్రమ నిర్మాణాలు హద్దులు దాటుతున్నా స్థానిక యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధికారుల నిర్లక్ష్యం, కొందరు ప్రజాప్రతినిధుల స్వార్థం వల్ల జంట జలాశయాల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యత తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై, కొమ్ము కాస్తున్న ప్రజాప్రతినిధులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన అక్రమ నిర్మాణాలను వెంటనే సీజ్ చేసి, కూల్చివేత చర్యలు చేపట్టాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల పలుకుబడికి అక్రమ నిర్మాణాలకు రక్షణ కవచాలుగా మారకుండా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నాను.


జె బి ఐ టి కాలేజీ ఎదురుగా కొనసాగుతున్న భారీ అక్రమ నిర్మాణం


అజీజ్ నగర్ ప్రధాన రహదారి పక్కన 100 గజాల స్థలంలో సెల్లార్ తో పాటు 4 అంతస్థుల నిర్మాణం

## అదే బాటలో కొందరు కౌన్సిలర్ల వసూళ్ల దందా ..!

ప్రభుత్వ ఆస్తులను, ప్రజల మాన, ప్రాణాలను కాపాడతామని ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కొందరు స్థానిక కౌన్సిలర్లు.. ఆ ప్రమాణాలనే గాలికొదిలేసి అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అండగా నిలవాల్సిన వారే అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ, తమ తమ వార్డుల్లో జరిగే అక్రమ నిర్మాణాల వ్యవహారంలో వకాల్తా పుచ్చుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ వార్డుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టండి.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా మేము చూసుకుంటామంటూ నిర్మాణదారులకు భరోసా ఇస్తూ, ఒక్కో నిర్మాణానికి చదరపు అడుగుల చొప్పున రేట్లు ఫిక్స్ చేసి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి.అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన ప్రజాప్రతినిధులే వాటికి రక్షణ కవచాలుగా మారితే ఇక నిబంధనలను అమలు చేసేదెవరు..? ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన వారే అక్రమార్కులకు అండగా నిలిస్తే ప్రజలకు న్యాయం జరిగేదెలా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


అజీజ్ నగర్ ప్రధాన రహదారి పక్కన అక్రమ షెడ్డు


అజీజ్ నగర్ ప్రధాన రహదారి పక్కన అక్రమ షెడ్డు


చిలుకూర్ బాలాజీ టెంపుల్ కి వెళ్లే దారిలో ఫంక్షన్ కోసం నిర్మిస్తున్న అక్రమ షెడ్డు



అజీజ్ నగర్ లో కొనసాగుతున్న బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణం



అజీజ్ నగర్ లో కొనసాగుతున్న రెండు బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలు



అజీజ్ నగర్ లో కొనసాగుతున్న మరో రెండు బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలు



అజీజ్ నగర్ లో కొనసాగుతున్న బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణం



అజీజ్ నగర్ పద్మావతి కాలనీ లో కొనసాగుతున్న బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణం

# ఎల్‌నినో దెబ్బ

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో వరి ధాన్యం మార్కెట్ అనూహ్య మలుపు తిరుగుతోంది. ఇప్పటి వరకు సన్న రకం వడ్లకు మాత్రమే అధిక ధరలు లభిస్తుండగా.. ఇప్పుడు దొడ్డు రకం ధాన్యానికీ బహిరంగ మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. ప్రభుత్వ కనీస మద్దతు ధరను మించి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో రైతులకు మంచి ధర లభిస్తోంది. కరీంనగర్ జిల్లా చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో దొడ్డు రకం ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,529 పలకడంతో ధాన్యం పండించిన రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. మరోవైపు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో జై శ్రీరామ్ సన్న రకం ధాన్యం ఏకంగా రూ.5,016 ధర పలికింది. దీంతో తెలంగాణలో సన్న, దొడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ పెరగడం చర్చనీయాంశంగా మారింది.గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని విక్రయించాలంటే రైతులు ఎక్కువగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపైనే ఆధారపడేవారు. బహిరంగ మార్కెట్‌లో ఆశించిన ధర రాకపోవడంతో ఐకేపీ, సహకార సంఘాల కేంద్రాల్లో విక్రయించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను మాత్రమే పొందేవారు. కొన్నిసార్లు ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ.200 నుంచి రూ.300 తక్కువకే కొనుగోలు చేసేవారు. అయితే ఈసారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దొడ్డు వడ్లకు కూడా ప్రైవేట్ వ్యాపారుల నుంచి భారీగా డిమాండ్ పెరగడంతో మద్దతు ధర కంటే అధికంగా చెల్లిస్తున్నారు. చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో సోమ, మంగళవారాల్లో దొడ్డు రకం ధాన్యానికి గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.2,529 ధర లభించింది. కనిష్ఠ ధర రూ.2,400 కాగా.. సగటున రూ.2,500 వరకు పలికింది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దసరా తర్వాత ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి మార్కెట్‌కు రోజూ వెయ్యి క్వింటాళ్లకు పైగా ధాన్యం వస్తోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సోమవారం రోజున 1,026 క్వింటాళ్లు.. మంగళవారం 1,118 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం విక్రయానికి వచ్చినట్లు పేర్కొన్నాయి. గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని.. ఇప్పుడు ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించిన రోజే డబ్బులు చేతికి అందుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దొడ్డు రకం ధాన్యానికి డిమాండ్ పెరగడంతో పాటు సన్న రకాల ధరలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జై శ్రీరామ్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.5,016 పలకడంతో అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఇది ఆ మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో పలు సన్న రకాల ధాన్యం క్వింటాల్‌కు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు ధర పలుకుతోంది. జై శ్రీరామ్‌తో పాటు ఆర్ఎన్ఆర్ వంటి రకాలకు కొన్ని మార్కెట్లలో రూ.4,300 వరకు లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో సన్న రకాలకే కాకుండా దొడ్డు రకం వడ్లకూ గిరాకీ పెరగడం రైతులకు భారీగా ఊరటను ఇస్తోంది. ధాన్యం ధరలు పెరగడానికి పలు కారణాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో తెలంగాణలో వరి సాగు సుమారు 14 శాతం తగ్గినట్లు అందిన సమాచారం చెబుతోంది. మరోవైపు.. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు, భవిష్యత్తు దిగుబడులపై ఆందోళనలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం సరఫరాపై వ్యాపారులు ముందుగానే అంచనాలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల కొనుగోలు ఆసక్తి పెరగడం మార్కెట్‌లో పోటీకి దారితీస్తోంది. కొందరు వ్యాపారులు రైతుల నుంచి ధాన్యాన్ని ముందుగానే సేకరించేందుకు.. పంట కోయకముందే అడ్వాన్స్ చెల్లింపులు చేస్తున్నారు. వరి పంట కోయగానే.. పచ్చి వడ్లకే భారీగా రేటు పెట్టి కొంటున్నారు. ఈ పరిణామాలు కూడా బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరగడానికి కారణం అవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఎల్‌నినో ఒక్కటే ధరల పెరుగుదలకు కారణమని నిర్ధారించలేమని.. సాగు విస్తీర్ణం, సరఫరా, డిమాండ్, ధాన్యం నాణ్యత వంటి అంశాల ప్రభావం కూడా ఉంటుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సాధారణ రకం ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,441 కాగా.. గ్రేడ్‌ఏ ధాన్యానికి రూ.2,461గా నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం అర్హత కలిగిన 7 సన్న రకాల ధాన్యానికి అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తోంది. దీంతో నిబంధనలకు అర్హమైన గ్రేడ్‌ఏ సన్న ధాన్యానికి మద్దతు ధర, బోనస్ కలిపి రూ.2,961 వరకు లభించే అవకాశాలు ఉన్నాయి. చొప్పదండి మార్కెట్‌లో దొడ్డు రకం ధాన్యానికి సగటున రూ.2,500, గరిష్ఠంగా రూ.2,529 లభిస్తుండటంతో సాధారణ రకం మద్దతు ధరతో పోలిస్తే రైతులకు అధిక ధర అందుతోంది.

# ఎల్ నినో వేళ జోరుగా నీటి దోపిడీ ..!

- మేడిపల్లి పరిధిలో యదేచ్ఛగా అక్రమ నీటి దందా...!
- వాల్టా చట్టానికి తూట్లు..!
- రోజుకు 200 నుంచి 300 వందల ట్యాంకర్ల నీటి విక్రయాలు..!
- ఒక్కో ట్యాంకర్‌కు రూ.2 వేల పైమాటే..!
- ఎల్ నినో ముప్పు పొంచి ఉండగా అక్రమంగా లక్షల లీటర్ల భూగర్భ జలాల తోడకం..!
- రెవెన్యూ ఇన్స్పెక్టర్ కనుసన్నల్లోనే కొనసాగుతున్న వైనం ..!
- తహసీల్దార్, హైడ్రా స్పందించాలంటున్న స్థానికులు..!






**మేడిపల్లి, అక్టోబర్ 29 (మహా ):**

ఒకవైపు ఎల్ నినో ప్రతికూల ప్రభావంతో ప్రస్తుతం, రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని పర్యావరణ నిపుణులు, భూగర్భ జల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మండుతున్న ఎండలకు తోడు భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతుండటంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు తప్పవనే ఆందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే, ఇలాంటి సున్నితమైన పరిస్థితులను కూడా కొందరు వ్యాపారులు తమ స్వార్థానికి అవకాశంగా మలుచుకుంటున్నారు. ప్రకృతి వనరులను కాపాడాల్సిన చోట, వ్యాపార దందాతో భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేస్తూ, నీటి దొంగలు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు .

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి మండలం, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉన్న పిల్లర్ నంబర్ 134 సమీపంలో ఈ అక్రమ నీటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏమాత్రం అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలను కాగితాలకే పరిమితం చేస్తూ, భారీ సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా రోజువారీగా లక్షలాది లీటర్ల నీటిని తోడేస్తూ బహిరంగంగానే విక్రయిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వాల్టా చట్టానికి తూట్లు..**

తెలంగాణ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ (వాల్టా) చట్టం 2002 ప్రకారం భూగర్భ జలాల ఉచిత/వాణిజ్య వెలికితీతపై స్పష్టమైన నియంత్రణలు, నిబంధనలు ఉన్నాయి. కానీ మేడిపల్లిలో ఈ చట్టం ఎక్కడా అమలు కావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద రైతులకు వ్యవసాయం కోసం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న విద్యుత్ కనెక్షన్లు, మీటర్లను దుర్వినియోగం చేస్తూ.. ఉచిత విద్యుత్‌తో బోర్ మోటార్లు నడిపి, ఆ నీటిని ట్యాంకర్లలో నింపి వాణిజ్యపరంగా విక్రయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

***రోజుకు వందల ట్యాంకర్లు.. లక్షల్లో దందా!***

పిల్లర్ నంబర్ 134 సమీపం నుంచి రోజుకు 200 నుంచి 300 ట్యాంకర్ల వరకు నీటిని తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.2 వేలకు పైగా వసూలు చేస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో ఈ వ్యవహారం వెనుక పెద్ద ఎత్తున వ్యాపారం సాగుతోందనే ప్రచారం కూడా వినిపిస్తోంది. ఇంత పెద్ద సంఖ్యలో ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**రెవెన్యూ ఇన్ స్పెక్టర్ కనుసన్నల్లోనే కొనసాగుతున్న వైనం..!**

నేషనల్ హైవే పక్కనే రోజూ వందలాది ట్యాంకర్ల రాకపోకలు సాగుతున్నా, స్థానిక అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా స్థానిక రెవెన్యూ ఇన్ స్పెక్టర్ కనుసన్నల్లోనే ఈ అక్రమ నీటి దందా నిర్విఘ్నంగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా తనిఖీలకు రాకపోవడం వెనుక లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రమాదంలో భూగర్భ జలాలు.. ఎండిపోతున్న పరిసరాల బోర్లు..**

నిరంతరాయంగా మోటార్లతో భూగర్భ జలాలను తోడేస్తుండటంతో పరిసర ప్రాంతాల్లోని కాలనీల్లో ఉన్న బోర్లు, బావులు ఎండిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా, ఈ ట్యాంకర్ల ద్వారా సరఫరా అవుతున్న నీరు తాగునీటి అవసరాలకు వాడుతున్నట్లయితే, ఆ నీటి నాణ్యతపై ఎటువంటి పరీక్షలు లేకపోవడం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడటమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**తహసీల్దార్, హైడ్రా స్పందించాలంటున్న స్థానికులు..!**

మేడిపల్లి తహసీల్దార్, రెవెన్యూ ఉన్నతాధికారులు, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పిల్లర్ నంబర్ 134 సమీపంలోని నీటి వెలికితీత కేంద్రాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, అక్రమంగా నడుస్తున్న ఆ బోర్లను తక్షణమే సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల కాలంలో రాజధాని నగరం, దాని పరిసర ప్రాంతాల్లో చెరువులు, కుంటల ఆక్రమణలతో పాటు వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి, వాణిజ్య అవసరాల కోసం అక్రమంగా భూగర్భ జలాలను తోడుతున్న వ్యాపారులపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సత్వర చర్యలు చేపడుతోంది. అనేక ప్రాంతాల్లో క్షేత్రస్థాయికి వెళ్ళి విద్యుత్ కనెక్షన్లను తొలగించడమే కాకుండా అక్రమ బోర్లను సీజ్ చేస్తూ, నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్న సంగతి తెలిసిందే. హైడ్రా సైతం మేడిపల్లి ఘటనలో తన పరిధిలోని అంశాలను పరిశీలించి, ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే వెంటనే రంగంలోకి దిగి ఆ అక్రమ బోర్లను సీజ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి వనరుల పరిరక్షణ అత్యంత కీలకంగా మారుతున్న ఈ వేళ.. భూగర్భ జలాల దుర్వినియోగానికి తక్షణమే అడ్డుకట్ట వేసి, ఈ అక్రమ నీటి వ్యాపారం వెనుక ఉన్న వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఏసీబీకి చిక్కిన ఇన్‌స్పెక్టర్

- యాదాద్రి కలెక్టరేట్‌లో ఏసీబీ దాడి
- పెట్రోల్ బంకు అనుమతులకు లంచం..
- రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టివేత

**యాదాద్రి, మహా** : ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరో అధికారిని పట్టుకున్నారు. యాదాద్రి జిల్లా కలెక్టరేట్ లో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. పెట్రోల్ బంకు అనుమతుల వ్యవహారంలో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పెట్రోల్ బంకు అనుమతులకు సంబంధించిన పనిని పూర్తి చేసేందుకు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మొదటి విడతగా రూ.20 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఈ డబ్బు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి పట్టుకున్నారు. జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేయడంతో అక్కడ కలకలం నెలకొంది. లంచం తీసుకుంటున్న అధికారిని పట్టుకోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపడుతున్నారు. లంచం డిమాండ్ చేసిన పరిస్థితులు, అనుమతుల వ్యవహారంలో ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అంశాలపై పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నారు.

# 12 మంది ఐఏఎస్‌లు ట్రాన్స్‌ఫర్

- రిటైర్మెంట్‌కు 3 రోజుల ముందు గవర్నర్ స్పెషల్ సీఎస్‌గా దానకిషోర్
- అటవీ శాఖకు జయేష్ రంజన్, ఇంధన శాఖకు వికాస్ రాజ్



**హైదరాబాద్, మహా :** ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. పలు శాఖల్లో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన ఉత్తర్వులను సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 12 మంది అధికారులకు స్థానచలనం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. కీలక శాఖల బాధ్యతల్లో మార్పులు చేసింది. మరోవైపు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం. దాన కిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పునర్నియమిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 1996 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం. దాన కిశోర్ పదవీకాలం ఈనెలాఖరు (అక్టోబర్ 31వ తేదీ)తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయనను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వం తిరిగి నియమించింది. దానకిశోర్ పునర్నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను ప్రత్యేకంగా జారీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా బదిలీల్లో భాగంగా పలువురు సీనియర్ అధికారులకు కీలక శాఖల బాధ్యతలు అప్పగించింది. జయేష్ రంజన్‌కు పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు కేటాయించింది. వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. నవీన్ మిట్టల్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంబంధిత శాఖల బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ శాఖలోని దేవాదాయ వ్యవహారాల బాధ్యతలు కేటాయించారు. ఏ. వాణీ ప్రసాద్‌కు క్రీడలు, హెరిటేజ్ తెలంగాణకు సంబంధించిన బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పులతో అటవీ, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, దేవాదాయ శాఖల్లో పరిపాలనా బాధ్యతల కేటాయింపులో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా శాఖల ప్రాధాన్యాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు అనుగుణంగా అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖలోనూ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు వివిధ శాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులకు కొత్త పోస్టింగులు ఇవ్వడంతో పాటు కొన్ని విభాగాల్లో అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తిని నియమించింది. రవాణా రంగంతో పాటు రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన బాధ్యతల కేటాయింపుపై కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాలను పరిశీలించాల్సి ఉంది. పట్టణాభివృద్ధి సంస్థలు, మహిళా సంక్షేమం, ఆరోగ్య శాఖల్లోనూ ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. హెచ్ఎండీఏ కమిషనర్‌గా పనిచేస్తున్న సర్ఫరాజ్ అహ్మద్‌కు కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)కు సంబంధించిన అదనపు బాధ్యతలు అప్పగించింది. పట్టణ ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సమన్వయం వంటి అంశాల్లో ఈ నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శృతి ఓజాకు మహిళా సంక్షేమం, ఎస్సీ సంక్షేమానికి సంబంధించిన శాఖల్లో ప్రత్యేక కార్యదర్శి బాధ్యతలు కేటాయించారు. వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీ ఫారూఖీని నియమించింది. డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణకు మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించింది. విద్యుత్ రంగంలోనూ బాధ్యతల పునర్వ్యవస్థీకరణ జరిగింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) ఎండీగా ఉన్న జితేష్ వి. పాటిల్‌కు టీజీ రెడ్కోకు సంబంధించిన అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ బదిలీలు, పోస్టింగులు రాష్ట్ర పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కీలక శాఖల్లో అధికారుల బాధ్యతలు మారడంతో ప్రభుత్వ పథకాల అమలు, శాఖల మధ్య సమన్వయం, పరిపాలనా నిర్ణయాలపై ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.



# అర్నబ్ తుఫాన్ నష్టం అపారం

- అంచనాకు వెంటనే ఏపీకి కేంద్ర బృందాలను పంపండి
- అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ

**అమరావతి, మహా** : అత్యంత తీవ్ర తుపాను అర్నబ్ కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిని వివరిస్తూ సీఎం నారా చంద్రబాబు నాయుడు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. నష్ట తీవ్రతను ప్రత్యక్షంగా పరిశీలించి అంచనా వేసేందుకు త్వరలోనే కేంద్ర అధ్యయన బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని సీఎం చంద్రబాబు తన లేఖలో విజ్ఞప్తి చేశారు. ముందస్తు చర్యల వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. అర్నబ్ తుపాను ముప్పు ఉన్న ప్రాంతాల నుంచి 28,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16 ఎన్ డీఆర్ఎఫ్, 11 ఎస్ డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించినట్లు వెల్లడించారు. అత్యవసర సేవలు, సహాయక చర్యలు రాత్రంతా కొనసాగాయని స్పష్టం చేశారు. సుమారు 70,900 హెక్టార్లలో వరి సహా ఇతర వ్యవసాయ పంటలు, మరో 10,450 హెక్టార్లలో ఉద్యాన పంటలు నీట మునిగినట్లు లేదా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. ముఖ్యంగా కోనసీమ జిల్లాలో ఇళ్లకు ఆస్తి నష్టం వాటిల్లింది. రాష్ట్ర రహదారులపై 220కి పైగా చెట్లు కూలిపోగా, వాటిలో 170కి పైగా చెట్లను తొలగించగా.. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. తీరప్రాంత జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని.. అయితే విద్యుత్ పునరుద్ధరణ, రహదారులపై చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరా పునరుద్ధరణకు ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, అనకాపల్లి జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉందని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. అర్నబ్ తుపాను ద్వారా సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదిక సమర్పించిన తర్వాత కేంద్ర బృందాన్ని త్వరగా పంపించాలని కేంద్రాన్ని సీఎం చంద్రబాబు కోరారు. ఎన్ డీఆర్ఎఫ్ సహా ఇతర కేంద్ర సంస్థల సహకారాన్ని కొనసాగించాలని అమిత్ షాకి ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాజధానిలో తాగు నీటి సమస్య రాకూడదు

- క్యూర్ ఏరియాలో ఎస్టీపీలు వంద శాతం పని చేయాలి
- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి
- తాగు నీరు సరఫరా, ఎస్టీపీలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబరు 28:** రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో సీఎం రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పని చేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్ తో పాటు సీఎంవో, అవుటర్ రింగ్ , మెట్రో రైల్ , ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సీఎం తెలిపారు. పబ్లిక్ పార్క్ లు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్ నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్ ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు ఉన్నోళ్ళకు మళ్లీ ఫామ్ 6 ఏంటీ

**అసలు బుర్ర వాడారా..?**
**ఈసీపై సుప్రీంకోర్టు ఫైర్**



ఢిల్లీ: ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమయంలో ఎన్నికల సంఘం అసలు బుర్ర ఉపయోగించిందా లేదా అని సుప్రీంకోర్టు ఫుల్ ఫైర్ అయింది. ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించబడిన లేదా చిరునామా మారిన పాత ఓటర్లను.. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించిన ఫారం 6 నింపమని ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించింది. రెండు వారాల్లోగా దీనికి సమాధానం చెప్పాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈసీని ఆదేశించింది. ఓటర్ల జాబితాలో ఇప్పటికే ఉండి, కేవలం తమ చిరునామాను మార్చుకున్న ఓటర్లను ఫారం 8 నింపడానికి అనుమతించాలని సూచించింది. సర్ ప్రక్రియలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో దాదాపు 43 లక్షల ఓటర్ల పేర్లను ఈసీ తొలగించింది. సామాజిక కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృతా జోహ్రీ దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా ఓట్లు తొలగించారని.. అలాగే ఓటరు జాబితా నుంచి తొలగించబడిన పాత ఓటర్లు తమ పేర్లను తిరిగి చేర్చుకోవడానికి ఈసీ ఫారం6 సమర్పించాలని ఆదేశించడాన్ని వారు సవాల్ చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం బుధవారం (అక్టోబర్ 28) ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఓటు హక్కు కలిగి ఉన్నవారిని కొత్త ఓటర్ నమోదు కోసం ఉద్దేశించిన ఫారం 6 సమర్పించమని కోరడం ఏంటీ..? ఢిల్లీ సర్ ప్రక్రియలో ఈసీ అసలు బుర్ర ఉపయోగించిందా అని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. పాత ఓటర్లు తాము ఇంతకుముందెన్నడూ ఓటు వేయలేదనే డిక్లరేషన్ ఉండే ఫారం6ను ఎలా సమర్పిస్తారని కోర్టు ప్రశ్నించింది.



# మంజీరా నదిలో తల్లి, ఇద్దరు కుమార్తెల మృతి

- ఆర్థిక ఇబ్బందులే కారణమా?
- చిన్నఘనపూర్ బ్రిడ్జి సమీపంలో మృతదేహాల వెలికితీత

**మెదక్, మహా** : మెదక్ జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. మంజీరా నదిలో తల్లి, ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. బుధవారం ఉదయం చిన్నఘనపూర్ శివారులోని మొదటి బ్రిడ్జి సమీపంలో వారి మృతదేహాలను కొల్చారం పోలీసులు వెలికితీశారు. తల్లితో పాటు ఇద్దరు చిన్నారులు విగతజీవులుగా కనిపించడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అభం శుభం తెలియని చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

**భర్త మృతితో కుటుంబ బాధ్యతలు...**

బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగోల్ల సరిత (27)కు వైష్ణవి (7), సాన్విక (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సరిత భర్త గతంలోనే మృతిచెందడంతో కుటుంబ బాధ్యతలన్నీ ఆమెపైనే పడ్డాయి. పిల్లలను తల్లిగారి ఇంట్లో ఉంచి, హైదరాబాద్‌లో ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ జీవనం సాగించేది. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి కుమార్తెలను చూసి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేది.

**ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన...?**

కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో సరిత తీవ్ర మనోవేదనకు గురైనట్లు బంధువులు తెలిపారు. పిల్లలను తాను పనిచేసే చోట ఉంచుకోలేకపోవడం, మరోచోట వదిలి వెళ్లాల్సి రావడంపై ఆవేదన చెందేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో కుటుంబ సమస్యలతో ఒత్తిడికి లోనైనట్లు వివరించారు. అయితే ఈ అంశాలపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**ఆధార్ సవరణ పేరుతో పిల్లలను తీసుకెళ్లి**

ఆధార్ కార్డులో సవరణ చేయించుకోవాలని చెప్పి సరిత తన తల్లి వద్ద ఉన్న ఇద్దరు కుమార్తెలను తీసుకెళ్లినట్లు బంధువులు వెల్లడించారు. అనంతరం ఏడుపాయలకు చేరుకున్న ఆమె.. పిల్లలతో కలిసి మంజీరా నదిలోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం చిన్న ఘనపూర్ శివారులోని మొదటి బ్రిడ్జి సమీపంలో ముగ్గురి మృతదేహాలను గుర్తించి వెలికితీశారు. కొల్చారం ఎస్ఐ మొయినుద్దీన్ మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో మల్కాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్..కత్తి స్వాధీనం

**హసన్‌పర్తి,మహా :** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి ఒడిగట్టిన నిందితుడిని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసులు వెల్లండించిన

**కేసు వివరాలు.**

వంగపహాడ్ గ్రామానికి చెందిన ముస్కు సంతోష్ (వయస్సు: 22 సం.లు, తండ్రి, సంరక్షకుడు సరిత, వృత్తి: టెంట్ హౌస్ వర్కర్) అనే యువకుడు ఆరో తరగతి వరకు చదువుకుని మానేశాడు. ప్రస్తుతం టెంట్ హౌస్ పాండాలు వేసే పనికి వెళ్తున్నాడు. ఈ నెల 21 10 2026 రాత్రి సుమారు 11 గంటల సమయంలో గ్రామంలో దుర్గామాత విగ్రహ ఊరేగింపు జరుగుతుండగా, సంతోష్ మద్యం సేవించి బస్టాండ్ సమీపంలోని హనుమాన్ విగ్రహం వద్ద ఊరేగింపు చూడటానికి వెళ్లాడు.

అక్కడ అతనికి అదే గ్రామానికి చెందిన ముస్కు వినోద్ (వయస్సు: 40 సం.లు, తండ్రి: బాల్ రెడ్డి, కులం: దొమ్మర) కనిపించాడు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా పాత పగలు ఉన్నాయి. ఈ క్రమంలో సంతోష్ అతని వద్దకు వెళ్ళి బూతులు తిడుతుండగా, అక్కడున్న స్థానికులు వారిని వారించి ఆపారు. ఎలాగైనా వినోద్ ను చంపాలనే ఉద్దేశంతో సంతోష్ తన ఇంట్లో ఉన్న కత్తిని తీసుకువచ్చి వినోద్‌ను చంపుతానని బెదిరించాడు. దీంతో ప్రాణభయంతో వినోద్ అక్కడి నుండి పారిపోయాడు. వినోదు ఫిర్యాదు మేరకు 23 10 2026 రోజున హసన్పర్తి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగినది

**నేరానికి ఉపయోగించిన కత్తి స్వాధీనం**

ఘటన అనంతరం నిందితుడు సంతోష్ ఆ కత్తిని వంగపహాడ్ గ్రామ శివారులోని శ్రీ కృష్ణ రేకుల కంపెనీ సమీపంలో ఉన్న చెట్ల పొదల్లో దాచిపెట్టాడు. బుధవారం నిందితుడు తిరిగి ఆ కత్తిని తీసుకోవడానికి రాగా, పక్కా సమాచారంతో పోలీసులు పంచుల (సాక్షుల) సమక్షంలో అతడిని పట్టుకున్నారు. నిందితుడు పంచుల ముందు నేరాన్ని ఒప్పుకుని ఇచ్చిన సమాచారం మేరకు పొదల్లో వెతకగా నేరానికి ఉపయోగించిన పొడవాటి, పదునైన ఇనుప కత్తి లభ్యమైంది.

**కత్తి యొక్క వివరాలు:**

స్వాధీనం చేసుకున్న కత్తి పిడి 4 ఇంచుల పొడవు గల చెక్కతో చేయబడి ఉన్నది. పిడి భాగం నుండి కత్తి 12 ఇంచుల పొడవు, ఒక ఇంచు వెడల్పు కలిగి ఉంది. అక్కడ నుండి పదునైన భాగం మొన వరకు 13 ఇంచుల పొడవుతో 'జే ' ఆకారంలో ఉంది. పోలీసులు ఈ కత్తిని స్వాధీనం చేసుకుని, సాక్షుల సంతకాలు గల చిట్టీలను దానికి అంటించి సీజ్ చేశారు.

హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ నిందితుడిని అరెస్ట్ చేసి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించడం జరిగింది.



# అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు రీషెడ్యూల్

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను రీషెడ్యూల్ చేశారు. దీంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీల్లో మార్పులు జరిగాయి. నవంబర్ 5న పోలింగ్.. 7న కౌంటింగ్.. కొత్త షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో నవంబర్ 6న రీపోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉండటంతో పోలీసు బందోబస్తు, ఎన్నికల సిబ్బంది కేటాయింపులో ఇబ్బందులు తలెత్తకుండా ఈ మార్పులు చేసినట్లు సమాచారం. కొత్త షెడ్యూల్‌తో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేపట్టనున్నారు.



# సినీ జూనియర్ ఆర్టిస్టుల మధ్య గొడవ కత్తితో దాడి!

**వెంకటగిరి వాటర్ ట్యాంక్ సమీపంలో ఘటన**
**యువకుడి పరిస్థితి విషమం**
**ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**బంజారాహిల్స్, మహా :** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. వెంకటగిరి వాటర్ ట్యాంక్ సమీపంలో మంగళవారం రాత్రి 10.41 గంటల సమయంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో నేపాల్‌కు చెందిన విశాల్ (25) తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి రాము (25), డానిష్ (32)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాము, డానిష్, విశాల్ ముగ్గురూ స్నేహితులు. సినిమా పరిశ్రమలో జూనియర్ ఆర్టిస్టులుగా పనిచేస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో ముగ్గురూ మద్యం మత్తులో ఉన్నారు. ఈ క్రమంలో రాము, డానిష్ కలిసి విశాల్‌పై కత్తితో దాడి చేశారు. గొడవకు అసలు కారణం ఏమిటన్నది ఇంకా స్పష్టత రాలేదు. దాడిలో విశాల్ కడుపు, ఛాతీ, వీపు భాగాల్లో కత్తిపోట్లు తగిలాయి. తీవ్రంగా గాయపడటంతో అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితులుగా భావిస్తున్న రాము, డానిష్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, దాడి వెనుక ఉన్న కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ముగ్గురి మధ్య ముందుగా ఏదైనా గొడవ జరిగిందా? మద్యం మత్తులో వివాదం ముదిరిందా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

# ఓటు ఉన్నోళ్ళకు మళ్లీ ఫామ్ 6 ఏంటీ

**అసలు బుర్ర వాడారా..?**
**ఈసీపై సుప్రీంకోర్టు ఫైర్**

**ఢిల్లీ:** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమయంలో ఎన్నికల సంఘం అసలు బుర్ర ఉపయోగించిందా లేదా అని సుప్రీంకోర్టు ఫుల్ ఫైర్ అయింది. ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించబడిన లేదా చిరునామా మారిన పాత ఓటర్లను.. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉద్దేశించిన ఫారం 6 నింపమని ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించింది. రెండు వారాల్లోగా దీనికి సమాధానం చెప్పాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈసీని ఆదేశించింది. ఓటర్ల జాబితాలో ఇప్పటికే ఉండి, కేవలం తమ చిరునామాను మార్చుకున్న ఓటర్లను ఫారం 8 నింపడానికి అనుమతించాలని సూచించింది. సర్ ప్రక్రియలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో దాదాపు 43 లక్షల ఓటర్ల పేర్లను ఈసీ తొలగించింది. సామాజిక కార్యకర్తలు అంజలి భరద్వాజ్, అమృతా జోహ్రీ దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా ఓట్లు తొలగించారని.. అలాగే ఓటరు జాబితా నుంచి తొలగించబడిన పాత ఓటర్లు తమ పేర్లను తిరిగి చేర్చుకోవడానికి ఈసీ ఫారం6 సమర్పించాలని ఆదేశించడాన్ని వారు సవాల్ చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం బుధవారం (అక్టోబర్ 28) ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే ఓటు హక్కు కలిగి ఉన్నవారిని కొత్త ఓటర్ నమోదు కోసం ఉద్దేశించిన ఫారం 6 సమర్పించమని కోరడం ఏంటీ..? ఢిల్లీ సర్ ప్రక్రియలో ఈసీ అసలు బుర్ర ఉపయోగించిందా అని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. పాత ఓటర్లు తాము ఇంతకుముందెన్నడూ ఓటు వేయలేదనే డిక్లరేషన్ ఉండే ఫారం6ను ఎలా సమర్పిస్తారని కోర్టు ప్రశ్నించింది.



# 35 ఏళ్లకే పక్షవాతం.. జాగ్రత్త!

**ఉద్యోగ జీవితంపై తీవ్ర ప్రభావం.. చిన్నవయసులోనూ పెరుగుతున్న ముప్పు**

హైదరాబాద్: పక్షవాతం అంటే వృద్ధాప్యంలో మాత్రమే వచ్చే సమస్య అనే భావనలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చిన్న వయసులోనూ ఈ సమస్య బారినపడే ప్రమాదం ఉండటంతో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న ఉద్యోగులు తమ పని ఒత్తిడి, జీవనశైలి, ఆహారపు అలవాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పక్షవాతం వచ్చినప్పుడు మెదడుకు రక్తప్రసరణలో ఆటంకం ఏర్పడటం లేదా మెదడులోని రక్తనాళం చిట్లి రక్తస్రావం జరగడం వల్ల మెదడు కణాలకు నష్టం కలుగుతుంది. ఈ పరిస్థితి శరీర కదలికలు, మాట, జ్ఞాపకశక్తి, రోజువారీ పనులపై ప్రభావం చూపవచ్చు. ఉద్యోగ జీవితంలో కీలక దశలో ఇలాంటి సమస్య ఎదురైతే వ్యక్తితో పాటు కుటుంబంపైనా ఆర్థిక, మానసిక భారం పడే అవకాశం ఉంటుంది. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం, ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పక్షవాతం ముప్పును పెంచే ప్రధాన కారణాల్లో ఉన్నాయి. రోజంతా కూర్చుని పనిచేయడం, వ్యాయామానికి సమయం కేటాయించకపోవడం, ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లను మార్చుకోవాలి. రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవడం అవసరం. పక్షవాతం లక్షణాలను ముందుగానే గుర్తించడం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. అకస్మాత్తుగా ముఖం ఒకవైపు వాలిపోవడం, ఒక చేయి లేదా కాలు బలహీనపడటం, మాట తడబడటం, చూపు మందగించడం, నడవడంలో ఇబ్బంది లేదా తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే అత్యవసర వైద్యసహాయం పొందాలి. లక్షణాలు కొద్దిసేపటికే తగ్గిపోయినా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఆక్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండటం, వైద్యుల సూచనల ప్రకారం దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. పని ఒత్తిడి పేరుతో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ప్రతి ఒక్కరికీ అవసరం.












# ఓటీటీల పనైపోయిందా?

**వీక్షకుల సంఖ్య అమాంతం డౌన్
సరికొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్న ఓటీటీరంగం**

**(మహా నెట్ వర్క్ )**

కరోనా సమయంలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ఓటీటీ ప్లాట్ ఫామ్‌లకు ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి దిగ్గజ దిగ్గజ సంస్థలకు కూడా మునుపటిలా సబ్‌స్క్రైబర్స్ వైభవం కరువైంది. కొంతమంది వ్యూవర్స్ స్ట్రీమింగ్ టైమ్ పెంచినా, ఓవరాల్‌గా కొత్త సబ్‌స్క్రైబర్ల సంఖ్య మాత్రం తగ్గుముఖం పట్టింది. ఈ సబ్‌స్క్రైబర్స్ కొరత ఒక్క నెట్‌ఫ్లిక్స్‌కే కాకుండా ఇతర ప్రముఖ ఓటీటీ సంస్థలకూ ఆందోళన కలిగిస్తోంది. వినియోగదారుల పల్స్‌లో మార్పులు రావడం, పోటీ పెరగడంతో ఓటీటీ రంగం ఇప్పుడు సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. వేలాది కోట్ల బిజినెస్ నడిపిన ఈ ప్లాట్‌ఫామ్‌ల భవిష్యత్తుపై ఈ పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

**వేలకోట్ల బిజినెస్**

ఓటీటీ ప్లాట్ ఫామ్స్ తోనే వేలాది కోట్ల రూపాయల బిజినెస్ సాగుతోంది. కొవిడ్ సమయంలో ఆడియెన్స్ పల్స్ పట్టేసిన ఓటీటీలు తరువాత వారి మనసుల్లో తిష్టవేసుకున్నాయి. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఓటీటీల్లో జెయింట్స్ అంటే నెట్ ఫ్లిక్స్ , అమెజాన్ ప్రైమ్ అనే చెప్పాలి. ఈ రెండు ప్లాట్ ఫామ్స్ కు మునుపటిలా సబ్ స్క్రైబర్స్ వైభవం లేదని లెక్కలు చెబుతున్నాయి. ఈ రెండు ఓటీటీ ప్లాట్ ఫామ్స్ మధ్య పోటీ సాగుతోన్నా, ఇతర ఓటీటీలు కూడా తమ సత్తా చాటుకొనే ప్రయత్నం చేస్తున్నాయి. తాజాగా వెలుగు చూసిన గణాంకాల ప్రకారం నెట్ ఫ్లిక్స్ లో వ్యూయింగ్ టైమ్ భారీ పెరిగింది. అయితే ఇండివిద్యువల్ యూజర్స్ రేట్ గణనీయంగా తగ్గటం విశేషం. వ్యూయింగ్ టైమ్ పెరగడానికి కొత్తగా సబ్ స్క్రైబ్ తీసుకున్నవారు అదేపనిగా నెట్ ఫ్లిక్స్ లోని కొన్ని సూపర్ హిట్ మూవీస్, వెబ్ సిరీస్ వీక్షించడం వల్ల స్ట్రీమింగ్ టైమ్ పెరిగింది. అయితే మునుపటితో పోల్చుకుంటే ఇప్పుడు సబ్‌స్క్రైబర్స్ సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందట. ఇది నెట్ ఫ్లిక్స్ ఒక్క ఓటీటీ ప్లాట్ ఫామ్‌కే కాదు ఇతర ప్రముఖ 'ఓవర్ ద టాప్' సంస్థలూ తగ్గిన సబ్‌స్క్రైబర్స్ తో ఆందోళనచెందుతున్నారు.




**అడ్డగోలుగా రేట్లుపెంచినందుకు షాక్**

అన్ని ఓటీటీ ప్లాట్ ఫామ్స్ లో ఇండివిద్యుయల్ యూజర్ ఎంగేజ్ మెంట్ సమయం తగ్గడానికి కారణాల్లో మొదటిది పెరిగిన సబ్ స్క్రిప్షన్ చార్జెస్ అనే చెప్పాలి. ప్యాండమిక్ సమయంలో అన్ని ఓటీటీ ప్లాట్ ఫామ్స్ జనాన్ని ఆకర్షించడానికి రీజనబుల్ రేటుకే సబ్ స్క్రిప్షన్ అందించాయి. దాంతో సినిమా థియేటర్స్ కు వెళ్ళి సినిమా చూసే ఖర్చుతోనే రెండు, మూడు ఓటీటీ ప్లాట్ ఫామ్స్ సబ్ స్క్రైబ్ చేసుకున్నారు. అలా అప్పట్లో థియేటర్స్ కు జనం రావడం తగ్గి ఓటీటీ స్ట్రీమింగ్ పెరిగింది. ప్రేక్షకులు తమవైపే ఉన్నారని తెలియగానే ఓటీటీ సంస్థలు భారీగా సబ్ స్క్రిప్షన్ రేట్స్ పెంచేశాయి. అయినప్పటికీ హిట్ సినిమాలు చూడాలనే కుతూహలంతో కొందరు సినీ ఫ్యాన్స్ వాటితోనే జర్నీ చేశారు. ఇక ఈ మధ్య ప్రఖ్యాత ఓటీటీ ప్లాట్ ఫామ్స్ అమెజాన్ ప్రైమ్, హాట్ స్టార్జ జీ5 లాంటివి యాడ్స్ మధ్య మాత్రమే తమ కంటెంట్‌ను స్ట్రీమింగ్ చేస్తూ వీక్షకుల సహనానికి పరీక్ష పెడుతూ వారి విలువైన సమయాన్ని వృథా చేస్తున్నాయి. ఈ యాడ్స్ కు ఫాస్ట్ ఫార్వర్డ్ చేసే ఆప్షన్ కూడా లేకపోవడంతో ప్రేక్షకులు విసిగిపోయారు. ఆ కారణంగానూ పలువురు సబ్ స్క్రిప్షన్స్ ను రద్దు చేసేసుకున్నారు. మధ్య మధ్యన వచ్చే చేజారిపోతున్న వీక్షకులను కాపాడుకునేందుకు ఓటీటీ సంస్థలు ఒరిజినల్స్ పై దృష్టిని కేంద్రీకరిస్తున్నాయి. పలు వెబ్ సిరీస్, వెబ్ మూవీస్, షార్ట్స్, ఇంటర్నేషనల్ ఇంటర్వ్యూస్, స్పోర్ట్స్ వంటి వాటిలోనూ వెచ్చిస్తున్నాయి. వ్యయం పెరిగింది కొత్త సబ్ స్క్రైబర్స్ మాత్రమే వస్తున్నారు. హిట్ మూవీస్ కారణంగా స్ట్రీమింగ్ రేట్ బాగుండటంతో ఎలాగోలా నెట్టుకు వస్తున్నాయి. అయితే జనాన్ని కట్టిపడేసేందుకు ఓటీటీలు చేస్తున్న ప్రయత్నాలేవీ అంతగా ఫలించడం లేదనే చెప్పాలి. తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్స్ ఆహా , 'జీ ఫైవ్' వంటివి సబ్ స్క్రిప్షన్ లో రాయితీలు ప్రకటించి ఆడియెన్స్ ను ఆకట్టుకోవాలని చూస్తున్నాయి.

**అన్ని భాషల్లోనూ.. అదే తీరు**

ఇతర ప్రాంతీయ భాషల ఓటీటీలూ ఇదే బాటన సాగుతున్నాయి. తగ్గేదే లేదంటూ అమెజాన్ ప్రైమ్, జియో హాట్ స్టార్ యాడ్స్ పెంచేస్తూనే పోతున్నాయి. దాంతో రోజు రోజుకూ వీటి సబ్ స్క్రైబర్స్ సంఖ్య తగ్గుతోంది. 'యాడ్ ఫ్రీ' కావాలంటే రెగ్యులర్ సబ్ స్క్రిప్షన్ తో పాటు అదనంగా చెల్లించాలనీ డిమాండ్ చేస్తున్నాయి. దీంతో వీటి స్థానంలో థర్డ్ పార్టీ యాప్స్ అనేకం పుట్టుకొచ్చి ఎలాంటి ప్రకటనలు లేకుండానే కంటెంట్‌ను నిరంతరాయంగా అందిస్తుండడంతో జనమంతా అటువైపే మొగ్గు చూపుతున్నారు. ఇదిలాఉంటే నవతరంలో అత్యధికులు 'బిగ్ స్క్రీన్' ఎక్స్ పీరియన్స్ కు తహతహలాడుతున్నారు.. దాంతో యంగ్ జనరేషన్ ఓటీటీలకు దూరంగా జరిగి మళ్ళీ థియేటర్స్ బాట పడుతున్నారు. ఇదే ఒరవడి పెరుగుతూ పోతే ఓటీటీలకు పెద్ద దెబ్బ పడే అవకాశం కనబడుతోంది. ఓటీటీలు తిరిగి ప్రేక్షకులను ఆకర్షించడానికి ఎలాంటి ప్రయత్నాలు, ఎత్తుగడలు అవలంభిస్తాయో చూడాలి.

# కొత్త తరం ప్రశ్నల్ని సంధిస్తోంది - సమాజం ఇచ్చే సమాధానం ఏమిటి?

ఒక తరం తన భవిష్యత్తు గురించి ప్రశ్నిస్తున్నప్పుడు, ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన బాధ్యత ఆ తరానిదే కాదు, మొత్తం సమాజానిది. చదువుకున్నా ఉద్యోగం దొరుకుతుందనే భరోసా లేనప్పుడు, ప్రతిభ ఉన్నా అవకాశాలు సమానంగా అందనప్పుడు, అభిప్రాయాన్ని వ్యక్తం చేయడమే సమస్యగా మారినప్పుడు యువత అసంతృప్తికి లోను కాదా!? ఇలా ఎందుకు అవుతున్నది, దీనికి కారణాలు ఏమిటి అని ఆలోచించదా, బాధ్యత వహించవలసిన వ్యవస్థలను ప్రశ్నించదా? యువత ఆందోళనలను ఆవేశం అని కొట్టిపారేయాలా, లేక అవి బయటపెడుతున్న సామాజిక వాస్తవాలను పరిశీలించాలా? యువత భవిష్యత్తు గురించి మాట్లాడటం అంటే వారి ఆశలను ఎత్తిపట్టడమే మాత్రమే కాదు; ఆ ఆశలకు అడ్డుగా నిలుస్తున్న వ్యవస్థల జవాబుదారీతనం గురించి నిలదీయడం కూడా.

ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న జెన్‌జీ ఉద్యమాలు ముందుకు తెచ్చిన ప్రశ్నలు అనేకం. వ్యక్తిగత విజయమే జీవిత లక్ష్యమని బోధించే సమాజంలో, ఆ విజయానికి అవసరమైన అవకాశాలు అందరికీ సమానంగా ఉన్నాయా? కులం, వర్గం, లింగం, ప్రాంతం, ఆర్థిక స్థితి ఒక వ్యక్తి భవిష్యత్తును ఎంతవరకు నిర్ణయిస్తున్నాయి? కొద్దిమంది సాధించిన విజయాలను చూపించి మొత్తం యువతరం అవకాశాల ప్రపంచంలో జీవిస్తోందని చెప్పగలమా? యువత ప్రశ్నల వెనుక ఉన్న సామాజిక వైరుధ్యాలను గుర్తించకుండా వారి అసంతృప్తిని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, రాజకీయ జవాబుదారీతనం, పౌరహక్కులపై పరిమితులు వంటి అంశాలపై యువత వ్యక్తం చేస్తున్న అసంతృప్తిని కేవలం తాత్కాలిక ఆవేశంగా చూడలేం. అయితే అన్ని ఉద్యమాలకూ ఒకే స్వభావం, ఒకే లక్ష్యం ఉండవు. వాటి వెనుక ఉన్న నిర్దిష్ట సామాజిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవాలి.

ఈ మొత్తం క్రమంలో సాహిత్యానికి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించడమే కాదు, మనకు అలవాటైన సామాజిక వాస్తవాలను కొత్తగా చూడటానికి కూడా సహాయపడుతుంది. మనిషి ఆకలి, అవమానం, భయం, ప్రేమ, ఆశ, తిరుగుబాటు వ్యక్తిగత అనుభవాలే అయినప్పటికీ, వాటి వెనుక సామాజిక సంబంధాలు, అధికార వ్యవస్థలు, అసమానతలు పనిచేస్తుంటాయి. వాటిని గుర్తించి వాటి పనితీరును లోతుగా అర్థం చేసుకొనటానికి సాహిత్యం సమర్థవంతంగా ఉపకరిస్తుంది. అయితే సాహిత్యాన్ని ఏదో ఒక సిద్ధాంతానికి ప్రచార సాధనంగా పరిమితం చేయడం కూడా సరైంది కాదు. సాహిత్యం ప్రజాసమూహాలమధ్య జరిగే అనేక భావరీతుల సంఘర్షణను ప్రతిఫలించాలి. దాని పని సిద్ధంగా ఉన్న సమాధానాలను ప్రకటించడం కాదు; ప్రశ్నించడానికి, అనుభవాలను విశ్లేషించడానికి, మన నమ్మకాలను పునఃపరిశీలించడానికి అవసరమైన స్వేచ్ఛను కల్పించడం.







సమాజంలో అందరి అనుభవాలు సాహిత్యంలోకి రావాలి. సకల సమూహాల భాషకు గుర్తింపు సాహిత్య గౌరవం లభించాలి. కొన్ని సముదాయాల బాధను వ్యక్తిగత సమస్యగా పక్కన పెట్టడం గాక మొత్తం జాతి సమస్యగా చర్చించాలి. కులం, వర్గం, లింగం, మతం, ప్రాంతం ఆధారంగా ఏర్పడే అసమానతలు మనుషుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఆలోచించాలి. అంచులకు నెట్టబడిన ప్రజల అనుభవాలకు సాహిత్యంలో స్థానం కల్పించడం కేవలం కొత్త విషయాలను పరిచయం చేయడం కాదు; సమాజాన్ని అర్థం చేసుకునే మన దృష్టినే విస్తరించడం. భిన్నమైన గొంతుకలు వినిపించినప్పుడే సాహిత్యం ప్రజాస్వామిక సంభాషణకు నిజమైన వేదిక కాగలదు. ఆ సంభాషణలో భిన్న అభిప్రాయాలకు చోటుండాలి. మనకు నచ్చని అభిప్రాయాలను కూడా ఆధారాలతో, తర్కంతో ఎదుర్కొనే సంస్కృతి పెరగాలి.

డిజిటల్ మాధ్యమాలు యువతకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, సమాచారాన్ని పంచుకోవడానికి, సమూహాలుగా ఏర్పడడానికి కొత్త అవకాశాలను కల్పించాయి. అధికారిక కథనాలను ప్రశ్నించడం, నిర్లక్ష్యానికి గురైన అనుభవాలను వెలుగులోకి తీసుకురావడం సాధ్యమైంది. కానీ సమాచార వేగం విమర్శనాత్మక ఆలోచనకు ప్రత్యామ్నాయం కాదు. తప్పుడు సమాచారం, ద్వేషపూరిత ప్రచారం, ఆన్‌లైన్ వేధింపులు, భిన్నాభిప్రాయాల పట్ల అసహనం డిజిటల్ ప్రపంచంలో స్వేచ్ఛకు కొత్త సవాళ్లుగా నిలుస్తున్నాయి. ఒక అసత్య కథనాన్ని అనేకమంది పంచుకున్నంత మాత్రాన అది నిజం కాదు. అందుకే భావప్రకటనా స్వేచ్ఛతో పాటు సమాచారాన్ని పరిశీలించే వివేచన, ఇతరుల హక్కులను గౌరవించే బాధ్యత కూడా అవసరం.

ఈ వివేచనను పెంపొందించడంలో విద్య పాత్ర కీలకం. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగం సంపాదించడమే విద్యకు అంతిమ లక్ష్యమైతే, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, అన్యాయాన్ని ప్రశ్నించడానికి, ప్రజాస్వామిక పౌరులుగా ఎదగడానికి అవసరమైన స్థలం సంకుచితమౌతుంది. అధిక ఫీజులు, విద్యాసంస్థల్లో వసతుల కొరత, బోధనలో నాణ్యత సమస్యలు, పరీక్షా వ్యవస్థలో అక్రమాలు, ఉపాధి అవకాశాల అనిశ్చితి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. వీటిని వ్యక్తిగత సమస్యలుగా చూడటం వల్ల వాటి వెనుక ఉన్న విద్యా విధానాలు, వనరుల పంపిణీ, ప్రభుత్వ బాధ్యత వంటి అంశాలు మరుగునపడతాయి. విద్యార్థుల భవిష్యత్తు గురించి చర్చించాలంటే వారి కలలను వినడంతో పాటు, ఆ కలలు సాకారం కావడానికి అవసరమైన సామాజిక పరిస్థితులను కూడా పరిశీలించాలి.

సంస్కృతి విషయంలోనూ ఇలాంటి పరిశీలనలే అవసరం. సంస్కృతిని ఎవరు నిర్వచిస్తున్నారు? ఏ విలువలకు సమాజంలో గౌరవం లభిస్తోంది? భిన్నమైన భాషలు, సంప్రదాయాలు, జీవన అనుభవాలకు సమాన స్థానం ఉందా? సంస్కృతి పేరుతో ఆధిపత్య విలువలు ఇతరులపై రుద్దబడుతున్నాయా? ఈ ప్రశ్నలు సంస్కృతిని నిరాకరించడానికి కాదు; దానిలోని వైవిధ్యాన్ని, అధికార సంబంధాలను అర్థం చేసుకోవడానికి. వీధి నాటకం సామాజిక వైరుధ్యాన్ని ప్రజల ముందుంచగలదు. కవిత వ్యక్తిగత బాధలోని సామాజిక కోణాన్ని వ్యక్తీకరించగలదు. కథ మనకు పరిచయమైన జీవితాలను కొత్త దృష్టితో చూపగలదు. కళలు మార్పును ఒక్కసారిగా తీసుకురాకపోయినా, అన్యాయాన్ని గుర్తించే చూపును, ప్రత్యామ్నాయ సమాజాన్ని ఊహించే శక్తిని పెంపొందించగలవు.

ఈ నేపథ్యంలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తన రెండవ ఎడిషన్ సమూహ యువ సాహిత్యోత్సవం-2026ను నిర్వహిస్తోంది. 'సంస్కృతి-ఆధిపత్య వ్యవస్థలు', 'డిజిటల్ మాధ్యమాలు-అసమ్మతి స్వరాలు', 'కొత్తతరం-సాహిత్య స్వరం', 'చదువుల మానిఫెస్టో-మేమెక్కడ?', 'ప్రదర్శన కళలు-సామాజిక మార్పు' అనే అంశాలపై చర్చలు ఈ కార్యక్రమంలో ప్రధానంగా నిలవనున్నాయి. వీటితో పాటు వీధి నాటిక, జెన్‌జీ కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆర్ట్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. యువత తమ అనుభవాలను, ఆలోచనలను, ఆకాంక్షలను వ్యక్తీకరించడానికి, భిన్నమైన అభిప్రాయాలతో సంభాషించడానికి ఈ కార్యక్రమాలు వేదిక కల్పిస్తాయి. యువత మారాలని చెప్పడం సులభం. కానీ యువతను ప్రభావితం చేస్తున్న పరిస్థితులను మార్చడానికి సమాజం ఎంతవరకు సిద్ధంగా ఉంది? వారి బాధ్యతలను గుర్తుచేసే ముందు హక్కులను గుర్తిస్తున్నామా? వారి కలలను ప్రోత్సహించే ముందు ఆ కలలకు అడ్డుగా ఉన్న అసమానతలను ప్రశ్నిస్తున్నామా? వారి గొంతును వినాలని చెప్పే ముందు ఆ గొంతు స్వేచ్ఛగా వినిపించే పరిస్థితులను కాపాడుతున్నామా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో భాగం. యువత ప్రశ్నించడం సమాజానికి ముప్పు కాదు. ఆ ప్రశ్నలను వినడానికి నిరాకరించడమే సమాజం తన భవిష్యత్తును సంకుచితం చేసుకోవడం. సాహిత్యం ప్రశ్నలకు భాషను ఇవ్వాలి. కళలు కనిపించని వైరుధ్యాలను కనిపించేలా చేయాలి. ప్రజాస్వామ్యం భిన్నాభిప్రాయాలకు స్థలం కల్పించాలి. ఈ మూడింటి మధ్య సంబంధాన్ని బలోపేతం చేయాలన్న ఆకాంక్షతో సమూహ యువ సాహిత్యోత్సవం నిర్వహించబడుతోంది. ఇది యువతకు ఉపన్యాసాలు వినిపించే కార్యక్రమం కాదు; వారి ఆలోచనలకు, అనుభవాలకు, విమర్శలకు స్థానం కల్పించే ప్రజాస్వామిక వేదిక. విద్యార్థులు, యువ రచయితలు, కవులు, కళాకారులు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాస్వామిక విలువలను ఆకాంక్షించే పౌరులందరూ ఈ సంభాషణలో భాగస్వాములు కావాలని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆహ్వానిస్తోంది.

**ప్రవేశం:** ఉచితం. అందరికీ ఆహ్వానం
సమూహ యువ సాహిత్యోత్సవం 2026
గోడల్ని ఛేదిద్దాం
**తేదీ:** 31 అక్టోబర్ 2026, శనివారం
**వేదిక:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, కోఠీ, హైదరాబాద్
సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం

# మార్షల్ ఆర్ట్స్ తోనే జీవితంలో క్రమశిక్షణ

- తల్లిదండ్రులు తమ పిల్లలకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలి
- హీరో సుమన్ తల్వార్

**కుషాయిగూడ, మహా :** ఎస్.ఎస్.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో చర్లపల్లి సిఐఎ హాలులో గ్రాండ్ బెల్ట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటుడు సుమన్ తల్వార్ హాజరయ్యారు. ఆయనతో పాటు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పలువురు ప్రముఖులు, నాయకులు, కరాటే శిక్షణ విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులకు హీరో సుమన్ తల్వార్ బ్లాక్ బెల్ట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హీరో సుమన్ తల్వార్ మాట్లాడుతూ మహిళలు, యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తాను 11వ ఏట మార్షల్ ఆర్ట్స్ కరాటేలోకి వచ్చానని ఇప్పటికీ 50 సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. తాను జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నానని, పలు రకాల సమస్యలు, ఆటుపోట్లను ఎదుర్కొని జీవితంలో పైకి ఎదగడానికి నా తల్లిదండ్రులు, మార్షల్ ఆర్ట్స్, తన విదేశీ కోచ్, ఎంతగానో దోహదపడ్డారని, బుద్ధిజం, క్రమశిక్షణ వల్ల ఉన్నత స్థానానికి ఎదిగానని తెలిపారు. ఈ మార్షల్ ఆర్ట్స్, కరాటే వలన జీవితంలో క్రమశిక్షణ, పట్టుదల, కృషి, ఓపిక, సమస్యలను ఎదుర్కొగల శక్తి వస్తుందని తెలిపారు. తల్లిదండ్రుల అన్ని సమయాల్లో తమ పిల్లలతో ఉండరని, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలకోసం ఎన్నో ప్రదేశాలకు ఒంటరిగా వెళ్లాల్సి వస్తుందని, అలాంటి ఒంటరిగా ఉన్న సమయంలో చిన్నారులు, యువతులు, మహిళలు తమను తాము దోపిడీ దొంగలు, నేరగాళ్లనుండి, రేపిస్టుల నుండి రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తనకు గన్ మెన్ లు లేకుండా ఉండటం హర్షించదగిన విషయం అన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థినీ విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్, కరాటేలో ప్రతినిత్యం శిక్షణ తీసుకోవాలని, తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని హీరో సుమన్ తల్వార్ సూచించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్నా, ఆత్మరక్షణకోసం కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా సహాయం చేస్తానని, ఎంబీబీఎస్ విద్యార్థులు ర్యాంకు వస్తే వారి పూర్తి ఖర్చు తానే భరిస్తామని తెలిపారు.



# చివరి యాత్ర మజిలీల అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు

- స్మశాన వాటికలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం.
- డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్

యాదవ్. **జవహర్ నగర్, మహా** : చివరి యాత్ర మజిలీల అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తామని చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. జవహర్ నగర్ చంద్రపురి కాలనీ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో హిందూ స్మశాన వాటికలో 11 లక్షల రూపాయలతో బుధవారం అభివృద్ధి పనులకు మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ తదితర పార్టీ శ్రేణులతో కలిసి శ్రీకాంత్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ స్మశాన వాటికలను (చివరి యాత్ర మజిలీలను) మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. జవహర్ నగర్ లోని వైకుంఠధామాలలో తాగడానికి మంచినీరు, నీడనిచ్చే షెడ్లు మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, సీనియర్ నాయకులు రజిత గోపాల్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కారంగుల రాజు గౌడ్, ఉపాధ్యక్షుడు చిట్టిబాబు, సామాజిక సేవకులు ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, జోగి సునీత, మాధవరెడ్డి, కోశాధికారి అశోక్ గుప్తా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం, నాయకులు సాయికృష్ణ, బబ్లు ముదిరాజ్, భాస్కర్ గౌడ్, కిషోర్, మంజుల, రవి, శ్రీరామ్, రాజు నిర్వాహకులు యాదయ్య, యాదగిరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల గుండెల్లో గుబులు

- ఆరుగురి అరెస్టుతో ములుగు జిల్లాలో కలకలం!
- అధ్యక్షులు సతీష్ పేరుతో వైరలవుతున్న చరవాణి సందేశం
- సీఐడీ వ్యూహం పై రైస్ మిల్లర్ల అసోసియేషన్‌లో ఉత్కంఠ

**ములుగు, మహా :** గత కొన్ని రోజులుగా ములుగు జిల్లాను కుదిపేస్తున్న రైస్ మిల్లర్ల వ్యవహారం పై ఉత్కంఠ కొనసాగుతుంది. ములుగు జిల్లాలో ఆరుగురు మిల్లర్లు అరెస్టు కావడం ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ నెల 25న అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల సమయంలో బాదం ప్రవీణ్‌తో పాటు మరో ఐదుగురు మిల్లర్లను సీఐడీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో మిల్లర్లలో ఆందోళన నెలకొందనే ప్రచారం సాగుతోంది. ప్రస్తుత తాజా అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్ పేరుతో మిల్లర్లకు పంపినట్లుగా వాట్సాప్ సందేశం వైరల్ కావడం జిల్లాలో కలకలం రేపుతోంది. ముందస్తు బెయిల్ వచ్చే వరకు ఎవరు బయట కనిపించవద్దని, ఫోన్‌లోనూ అందుబాటులో ఉండొద్దని సందేశంలో సూచించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. కాగా ఈ సందేశాన్ని సతీష్ పంపించారా? అందులోని వివరాలు నిజమేనా? అన్నది ఇంకా అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఈ నెల 25న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల సందర్భంగా బాదం ప్రవీణ్‌ను సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆయనతో పాటు మరో ఐదుగురు మిల్లర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ పరిణామాల మధ్య ప్రవీణ్ తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో కాట్రగడ్డ సతీష్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న అరెస్టులు, అనంతరం వైరల్ అయిన సందేశం మిల్లర్ల వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయని తెలుస్తోంది.

**అసలు మెసేజ్ లో ఏముంది?**

జిల్లా మిల్లర్ల అసోసియేషన్ గ్రూపులో సతీష్ పేరుతో ఉన్న సందేశంలో 'గ్రేడ్ఏ టు కామన్' బియ్యం మార్పిడి వ్యవహారాన్ని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. హైకోర్టు న్యాయవాదితో మాట్లాడామని, ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అందులో పేర్కొన్నట్లు సమాచారం. బెయిల్ పై స్పష్టత వచ్చే వరకు రెండు రోజుల పాటు బయట కనిపించకుండా ఉండాలని, ఫోన్‌లో కూడా అందుబాటులో ఉండవద్దని సూచించినట్లు సందేశంలో ఉందని చెబుతున్నారు. చివరలో 'మీ ప్రెసిడెంట్ సతీష్' అని ఉండటంతో ప్రస్తుతం ఆ సందేశం చుట్టూ చర్చలు కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో సతీష్‌తో పాటు మరికొందరు మిల్లర్లు అందుబాటులో లేరని, పరారయ్యారనే ప్రచారం మొదలైంది. కాగా వారి ప్రస్తుత ఆచూకీ పై అధికారిక సమాచారం లేదు. కేవలం సందేశం ఆధారంగా వారు పరారయ్యారని నిర్ధారించడం సాధ్యం కాదు. సంబంధిత వ్యక్తుల వివరణ, అధికారుల ప్రకటన వెలువడితేనే ఈ ప్రచారం పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**సీఐడీ తదుపరి వ్యూహం పై ఉత్కంఠ**

సీఎంఆర్ బియ్యం సరఫరాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో గతంలో పలు మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు జరిగినట్లు సమాచారం. తాజాగా ఆరుగురు మిల్లర్ల అరెస్టు, రిమాండ్ నేపథ్యంలో దర్యాప్తు ఎటువైపు సాగుతుందన్న ఆసక్తి నెలకొంది. వైరల్ సందేశంపై సీఐడీ దృష్టి సారిస్తుందా? అధ్యక్షుడు కాట్రగడ్డ సతీష్‌తో పాటు ఇతర మిల్లర్ల పాత్రపై విచారణ చేపడుతుందా? అన్న ప్రశ్నలకు అధికారులు అధికారిక వివరణ ఇచ్చే వరకు వేచి చూడాల్సిందే.!




# మత్తుకు కాదు : కలలకు ఊపిరి పోయండి

- 2029 నాటికి నషా ముక్త్ తెలంగాణే లక్ష్యం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- 'నషా ముక్త్ భారత్', 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్–2047' అవగాహన కార్యక్రమంలో గవర్నర్



హైదరాబాద్, మహా : యువత తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని, మాదకద్రవ్యాల మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. 2029 నాటికి తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన 'నషా ముక్త్ భారత్', 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్-2047' అవగాహన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని ప్రసంగించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో విద్యార్థులు, యువత ముందుండాలని కోరారు.

**విద్యాసంస్థల్లోనే ప్రతిజ్ఞ చేయించాలి**

పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశం పొందే సమయంలోనే విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించే విధానాన్ని తప్పనిసరి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్లు గవర్నర్ తెలిపారు. యువతలో చిన్న వయసు నుంచే డ్రగ్స్‌పై అవగాహన పెంచడం ద్వారా వ్యసనాల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని, యువత ఆరోగ్యంగా, లక్ష్యసాధన పట్ల నిబద్ధతతో ఉన్నప్పుడే వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల అలవాటు ఒక్క వ్యక్తి జీవితానికే కాకుండా కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని అవమానించడం లేదా సమాజానికి దూరం పెట్టడం సరికాదని గవర్నర్ అన్నారు. వారికి వైద్యం, కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల సహకారం అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. 'మాదకద్రవ్యాలపై పోరాడాలి.. వ్యసనానికి గురైన వ్యక్తిపై కాదు' అనే దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని సంపాదిస్తూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతోపాటు దేశ అభివృద్ధికి తోడ్పడటం యువత బాధ్యతని పేర్కొన్నారు.

**నవంబర్ 14 నుంచి 60 రోజుల ప్రత్యేక కార్యక్రమం**

మాదకద్రవ్యాల ప్రమాదాలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంచేందుకు నవంబర్ 14 బాలల దినోత్సవం నుంచి జనవరి 12 జాతీయ యువజన దినోత్సవం వరకు 60 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గవర్నర్ వెల్లడించారు. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో సదస్సులు, ప్రదర్శనలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించాలని, ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే విద్యాసంస్థలను గుర్తించి ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యను అందించడంతోపాటు నైతిక విలువలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించే కేంద్రాలుగా ఉండాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రారంభమైన చైతన్యం రాష్ట్రంలోని ప్రతి పాఠశాల, కళాశాల, గ్రామం, ఇంటికి చేరాలని గవర్నర్ ఆకాంక్షించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలు ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి అవగాహన రాయబారిగా మారి తన తోటి విద్యార్థులను, స్నేహితులను కూడా మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని సూచించారు.

**రెడ్‌క్రాస్ సభ్యత్వం 1.28 లక్షలకు పైగా**

తెలంగాణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాల విస్తరణపై గవర్నర్ వివరించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 32 జిల్లా శాఖలకు నిర్వహణ కమిటీ ఎన్నికలు పూర్తయ్యాయని తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యత్వం 1.28 లక్షలు దాటిందని, జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల్లో 16 లక్షలకు పైగా నమోదు జరిగిందని పేర్కొన్నారు.ఆపద మిత్ర కార్యక్రమంలో 6,000 మంది నమోదు కాగా, మై భారత్ పోర్టల్‌లో 5.20 లక్షలకు పైగా యువత పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో 2,000 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆపద మిత్ర కార్యక్రమంలో చేరడాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సేవాభావం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు.

**యువత భాగస్వామ్యంతోనే నషా ముక్త్ భారత్**

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఆర్‌సీఎస్ తెలంగాణ శాఖ ఛైర్మన్ ఎం. దానకిశోర్ మాట్లాడుతూ.. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. జిల్లాల పర్యటనలు, వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు.తెలంగాణలో రెడ్‌క్రాస్ సభ్యుల సంఖ్య సుమారు 40 వేల నుంచి 1.28 లక్షలకు పెరిగిందని, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థుల భాగస్వామ్యం కూడా విస్తరించిందని వివరించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు.

కార్యక్రమంలో గవర్నర్ నషా ముక్త్ భారత్ పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు, యువతతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదాతలను ప్రోత్సహించారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియం నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, రెడ్‌క్రాస్ సభ్యులతో నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, గవర్నర్ సంయుక్త కార్యదర్శి కొమండూరు శశికిరణ్, ఐఆర్‌సీఎస్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి రాములు, అధ్యాపకులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహించాలని గవర్నర్ యువతకు పిలుపునిచ్చారు. 'మత్తుకు నో చెప్పండి.. జీవితానికి అవును చెప్పండి' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమష్టి కృషితో తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.



## మంత్రి పొంగులేటికి ఆత్మీయ శుభాకాంక్షలు

**తెలిపిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల, ఎమ్మెల్యే నాయిని**

**హనుమకొండ, మహా; :** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మంత్రిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి వారు పుష్పగుచ్చాలు అందజేసి ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఉద్యోగం పేరుతో మోసం

**ప్రైవేట్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ మహిళపై లైంగిక దాడి ఫిర్యాదు**



**కుషాయిగూడ, మహా** : ఉద్యోగం ఇప్పిస్తామంటూ పరిచయం పెంచుకుని, ప్రైవేట్ ఫొటోలు, వీడియోలతో బెదిరించి రూ.8 లక్షల నగదుతో పాటు బంగారు ఆభరణాలు వసూలు చేసినట్లు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. దివ్య, హరి, ప్రశాంత్ అనే ముగ్గురిపై బాధితురాలు ఆరోపణలు చేసింది. మత్తు పదార్థం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి స్పృహ కోల్పోయిన స్థితిలో ఇద్దరు వ్యక్తులు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై తొలుత కీసర పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు, పరిధికి సంబంధించిన కారణాలతో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయింది. ప్రస్తుతం కేసుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెలుగులోకి రావాల్సి ఉంది.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే మా లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్
- ఎన్రోల్మెంట్‌లో తూర్పు నియోజకవర్గం ముందంజ అభినందనీయం
- ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ మర్రి యాదవ రెడ్డి

**వరంగల్, మహా ;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో వరంగల్, ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ ఛైర్మన్ మర్రి యాదవ రెడ్డి ముఖ్యంగా పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ..**

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ముందంజలో ఉండటం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నన్నపునేని నరేందర్ కు డివిజన్ బాధ్యులకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఇక పై కూడా కొత్తగా అర్హత పొందిన పట్టభద్రులతో పాటు గతంలో ఓటు నమోదు చేసుకున్న వారి వివరాలను పరిశీలిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. ఎన్రోల్మెంట్ పూర్తయిన అనంతరం ప్రతి పట్టభద్రుడి ఇంటికి వెళ్లి, బీఎల్వోల ద్వారా ఓటు నమోదును ధృవీకరించుకునేలా డివిజన్ ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ..**

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పట్టభద్రుల ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇప్పటివరకు వరంగల్, కిలా వరంగల్ మండలాల పరిధిలో మొత్తం 13,650 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకోగా, అందులో వర్ధన్నపేట, హనుమకొండ నియోజకవర్గాలకు సంబంధించిన సుమారు 1,600 ఓట్లను మినహాయిస్తే మిగిలిన వాటిలో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల కృషితో 5,600 మంది పట్టభద్రుల ఎన్రోల్మెంట్ చేయించడం జరిగిందని తెలిపారు.

గత 2024 ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో సుమారు 14,500 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా, ఈసారి అదనంగా మరో 4,000 మంది పట్టభద్రులను ఎన్రోల్మెంట్ చేయించి మొత్తం 18,500 మంది పట్టభద్రుల ఓటర్ల నమోదును లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి డివిజన్‌లో సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడంతో పాటు, నమోదైన ఓటు వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించుకోవాలని సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ, ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ మాజీ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు, పట్టభద్రులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూకట్ పల్లిలో విషాదం చిన్నారితో సహా దంపతుల మృతి

**కూకట్ పల్లి, మహా :** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) మూడో ఫేజ్‌లో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ ఇంట్లో దంపతులు.. రెండేళ్ల చిన్నారి విగతజీవులుగా కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోపీనాథ్, సమత 2023లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల పాప ఉంది. అయితే.. మంగళవారం ఉదయం నుంచి ఇంటి తలుపులు తెరవకపోవడంతో స్థానికులకు అనుమానం కలిగి డయల్ 112కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇంటి తలుపులు తెరిచి చూడగా.. డైనింగ్ హాల్లో గోపీనాథ్, సమత ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. బెడ్‌రూమ్‌లో రెండేళ్ల చిన్నారి మృతదేహం కనిపించింది. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గోపీనాథ్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నారు. కుటుంబంలో చోటుచేసుకున్న ఈ విషాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## ఆర్నబ్ తుఫాన్ ప్రభావం నుండి

- డంపింగ్ ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోండి
- ప్రమాదకరంగా ప్రస్తుత వాతావరణ మార్పులు
- ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి

**జవహర్ నగర్, మహా :** అర్నబ్ తుఫాన్ ప్రభావం నుండి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టాలని ఇఫ్టు జాతీయ కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. జవహర్ నగర్ లో మీడియాతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను అర్నబ్ కారణంగా గత రెండు రోజులుగా ఏర్పడిన వాతావరణ మార్పుల మూలంగా జవహర్ నగర్ పరిధిలోని రాంకీ డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందనే బాధితులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటు రాంకీ డంపింగ్ యార్డ్ యాజమాన్యం ప్రజా ఆరోగ్య పరిరక్షణ చర్యలు యుద్ధ ప్రాతిపదిక చేపట్టాలన్నారు. ప్రజల ఆరోగ్యం వారి ప్రాణాల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా జరగబోయే ప్రతి చావుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాంకీ యాజమాన్యమే నైతిక బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం చేపట్టిన నత్త నడక సహాయ చర్యలతో జన జీవనం అస్తవ్యస్తంగా తయారైందని మండిపడ్డారు. జన సమూహాలున్న యాప్రాల్, జవహర్ నగర్, నాగారం, దమ్మాయిగూడ, అంబేద్కర్ నగర్ ప్రధాన రోడ్లపై చెత్త లారీలు నడవకుండా చూడాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ రాంకీ లాభాల కోసం కాకుండా ప్రజల ప్రాణాల కోసం పాటుపడాలని కోరారు. ప్రజలు ప్రశ్నించకుండా ఉన్నంతకాలం ప్రమాదకరమైన తుఫానులకు సామాన్య పేద మధ్యతరగతి ప్రజానీకం బలి అవుతుంటారని గుర్తు చేశారు. దోమలు దుర్వాసన కలుషిత నీరు నుండి ప్రజలను కాపాడేందుకు బ్లీచింగ్, క్యాపింగ్ లాంటి చర్యలు వేగంగా చేపట్టాలని సూచించారు.

## ఏసీబీ అదుపులో బంజారాహిల్స్ ఎస్ఐ

- రూ.లక్ష లంచం తీసుకుంటుండంగా పట్టివేత
- బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు
- బాధితుడిని రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు

**బంజారాహిల్స్, మహా :** నగరంలోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న విజయ్ రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. బాధితుడి నుంచి రూ.10 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగా మొదటి విడతగా రూ.లక్ష తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. బాధితుడి నుంచి ఎస్ఐ విజయ్ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు చర్యలు చేపట్టారు. లంచం సొమ్ము తీసుకుంటున్న సమయంలో దాడి చేసి ఎస్ఐను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ఎస్ఐ విజయ్‌ను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. లంచం డిమాండ్‌కు సంబంధించిన వివరాలు, ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణాల్లో అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.



# నిర్ధాక్షిణ్యంగా శిక్షించాల్సిందే

- సైబర్ నేరగాళ్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా :** డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరగాళ్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. సైబర్ నేరం సాధారణ నేరం కాదని 'డిజిటల్ దోపిడీ'.. నిర్ధాక్షిణ్యంగా శిక్షించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మోసాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను ఆదేశించింది. వీడియో కాల్స్ ద్వారా అమాయకులను, వృద్ధులను భయపెట్టే ఈ నేరాలు 'డిజిటల్ దోపిడీ' వంటివని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. నేరగాళ్లను అత్యంత నిర్ధాక్షిణ్యంగా శిక్షించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఒకచోట చేర్చాలన్న నిందితుల పిటిషన్‌ను కొట్టి వేసింది. నిందితుల సౌలభ్యం కోసం బాధితులను ఇబ్బంది పెట్టలేమని, స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# పీడీపీ చట్టంతో జర్నలిస్టుల స్వేచ్ఛకు ఎలాంటి ముప్పు లేదు

**న్యూఢిల్లీ, మహా :** డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం 2023 వల్ల జర్నలిస్టుల స్వేచ్ఛకు ఎలాంటి ముప్పు వాటిల్లదని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం స్పష్టం చేశారు. మీడియా స్వేచ్ఛా వార్తలు నివేదించే సామర్థ్యాన్ని బలహీనపరిచే నిబంధన ఏదీ ఈ చట్టంలో లేదని ఆయన హామీ ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛకు ఈ చట్టం పూర్తి భద్రత కల్పిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డీఎన్‌పీఏ) ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసిన నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ చట్టంలో జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు లేకపోవడం వల్ల వార్తా సేకరణకు ఆటంకం కలుగుతుందని, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుందని, పౌరుల సమాచార హక్కు బలహీనపడుతుందని డీఎన్‌పీఏ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందించాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రాన్ని ఆదేశించింది. మీడియా సంస్థల ఆందోళనలపై స్పందించిన వైష్ణవ్, చట్టం రూపకల్పన ప్రక్రియను వివరించారు.





# ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించటమే లక్ష్యంగా పనిచేశాం

( మొదటి పేజీ తరువాయి )

రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తుఫాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల వరకు అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేశారని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు, షెల్టర్ క్యాంపులకు తరలించడంతో పాటు, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించామని చెప్పారు. రెస్క్యూ, రిలీఫ్ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. పంట నష్టాన్ని మినహాయించి, ఇతర నష్టాలకు సంబంధించి అర్హులైన బాధితులకు గురువారం నుంచే ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ అంశంపై గురువారం వర్చువల్ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తుఫాను వల్ల జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడి తుఫాను తీవ్రత, రాష్ట్రంపై దాని ప్రభావాన్ని వివరించినట్లు చెప్పారు. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని, సమగ్ర నష్ట నివేదికను కూడా త్వరలోనే కేంద్రానికి పంపిస్తామని వెల్లడించారు.

**సాంకేతికతతో కచ్చితమైన అంచనాలు**

తుఫాను ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు తెలిపారు. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా మిగతా జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోనూ ఎల్లుండి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు. రాష్ట్ర రహదారులు, రహదారుల పై రాకపోకలను బుధవారం రాత్రికే పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను కూడా సిద్ధం చేశామని వివరించారు. గతంలో తుఫాను హెచ్చరికలు వచ్చినప్పుడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సి వచ్చేదని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో తుఫాను ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో ముందుగానే గుర్తించి, అక్కడే అధికార యంత్రాంగాన్ని మోహరిస్తున్నామని



వివరించారు. ప్రిడిక్షన్, యాక్యురెసీ, క్షేత్రస్థాయిలో అప్రమత్తత అనే విధానాలతో విపత్తును ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఐఎండీ సమాచారం, ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తుఫాను గమనాన్ని అంచనా వేశామని చెప్పారు. సముద్రంలో నెలకొన్న వివిధ వాతావరణ పరిస్థితుల కారణంగా తుఫాను ఏపీ తీరంపై సుమారు 10 గంటలపాటు నిలిచిపోయిందని, తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని వెల్లడించారు. సుమారు 30 వేల మంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్సుల ద్వారా నిరంతరం సమన్వయం చేసుకున్నామని తెలిపారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం**

తుఫాను ప్రభావంతో విశాఖపట్నంలో విద్యుత్‌పై చెట్టు కూలిన ఘటనలో ఇద్దరు, అనకాపల్లిలో ఒకరు, కోనసీమలో ఒకరు, భీమవరంలో మరొకరు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. తుఫాను కారణంగా ఇళ్లు, పంటలు, దుకాణాలు, ఇతర ఆస్తులు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు 25 కిలోల బియ్యం అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చేనేత కార్మికులు, మత్స్యకారులకు 50 కిలోల బియ్యంతో పాటు కిలో చొప్పున ఉల్లి, వంటనూనె, కందిపప్పు అందిస్తామని ప్రకటించారు. షెల్టర్ క్యాంపుల్లో ఆశ్రయం పొందిన వారికి రూ.1,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఉద్యాన పంటలకు సంబంధించి అరటి పంటకు హెక్టారుకు రూ.35,000, టమాటాకు రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. పత్తి, చెరకు తదితర పంటలకు హెక్టారుకు రూ.25,000 చొప్పున సాయం అందించే అంశాన్ని వెల్లడించారు. ఇతర పంటలకు నష్టం కేటగిరీల వారీగా పరిహారం అందిస్తామని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని ఎన్యుమరేషన్ ద్వారా అంచనా వేసి రైతులను ఆదుకుంటామని తెలిపారు.

**ప్రభావిత ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన**

అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో వర్షపాతం పెరిగిందని సీఎం తెలిపారు. రాష్ట్ర సగటు లోటు వర్షపాతం 39 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందని చెప్పారు. విశాఖపట్నంలో 21 సెంటీమీటర్లు, విజయనగరంలో 18 సెంటీమీటర్లు, శ్రీకాకుళం జిల్లాలో 14 సెంటీమీటర్లు, కృష్ణా జిల్లాలో 9 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైందని వివరించారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. వర్షపు నీటిని సమర్థంగా వినియోగించుకు నేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేశామని, ఏ చెరువును నింపాలి, ఏ రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లించాలన్న అంశాలపై కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ముందస్తు చర్యలు, కాలువల్లో అడ్డంకులను తొలగించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఒక్క చెరువుకు కూడా గండి పడలేదని చెప్పారు. శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో మరికొంత వర్షం కురిసే అవకాశం ఉన్నందున అక్కడి ప్రజలను అప్రమత్తం చేశామని వెల్లడించారు. గత మూడు రోజులుగా నిరంతరం పనిచేసిన అధికారులు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. తాను, అధికారులు, సిబ్బంది రాత్రంతా నిద్ర లేకుండా ప్రజలకు సేవలందించామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించారని పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి సహాయక చర్యలను కొనసాగించాలని సూచించారు. గురువారం స్వయంగా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బాధితులకు వేగంగా సహాయం అందించి, ప్రజల్లో భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



# డ్రగ్స్ పై సమర శంఖం

- అన్ని శాఖల సమన్వయంతోనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణాం
- రంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్
- విద్యార్థులను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచాలి
- బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలి
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**కలెక్టరేట్, మహా :** హనుమకొండ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతను మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడేందుకు పాఠశాల స్థాయి నుంచే విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని సూచించారు.విద్యాప్రేరణ, నయీ కిరణ్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు, చదువుకు దూరమైన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు బడి మానేయకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు.ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా బాలలను గుర్తించి, వారికి రక్షణ, సంరక్షణ, పునరావాసం కల్పించడంలో సంబంధిత శాఖలు మరింత చొరవ చూపాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణ పోలీసు శాఖ ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, విద్యాశాఖ, ఎక్సైజ్, అటవీ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని సీపీ పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రవర్తనలో అసాధారణ మార్పులను గుర్తించి, అవసరమైనప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్సైజ్, అటవీ శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలల సంఘాలు, విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఛలో ఢిల్లీ

( మొదటి పేజీ తరువాయి )

ప్రత్యేకంగా రైళ్లు, బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు ఢిల్లీలో వసతి, ఇతర సదుపాయాల దృష్ట్యా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఏర్పాట్లపై బుధవారం పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ డీసీసీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.

**ప్రత్యేక రైళ్లు, 100 బస్సుల ఏర్పాట్లు**

దేశవ్యాప్తంగా ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. 'ఓట్ బచావో దేశ్ బచావో' నినాదంతో నవంబర్ 1న ఢిల్లీలోని చరిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ భారీ ర్యాలీ నిర్వహించనుంది. రాహుల్ గాంధీ నేతృత్వంలో జరగనున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులను తరలించేలా పీసీసీ కార్యాచరణ సిద్ధం చేసింది. 119 నియోజకవర్గాల నుంచి దాదాపు 10 వేల మందిని ఢిల్లీకి తీసుకెళ్లాలని ప్రణాళిక రూపొందించింది. రెండు ప్రత్యేక రైళ్లు, 100 ప్రత్యేక బస్సుల ద్వారా కార్యకర్తలను ఢిల్లీకి తరలించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**జిల్లాలు, నియోజకవర్గాల వారీగా నేతలకు ఏఐసీసీ దిశానిర్దేశం**

జన సమీకరణతో పాటు కార్యకర్తల ప్రయాణం, వసతి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పీసీసీ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ ప్రతినిధులు, నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేశారు. అందరూ సమష్టిగా పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

# చర్లపల్లికి పీహెచ్‌సీ మంజూరు చేయాలి

## డీఎంహెచ్‌వోను కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చర్లపల్లి ప్రాంతంలో పీహెచ్‌సీ ఏర్పాటు ఆవశ్యకతను ఎమ్మెల్యే వివరించారు. స్థానికులకు వైద్య సేవలు చేరువ కావడంతో పాటు అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్యం అందించేందుకు ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీ మంజూరుకు చర్యలు తీసుకోవాలని




కోరారు. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌వో ఆనంద్ త్వరలో చర్లపల్లి ప్రాంతాన్ని సందర్శించి, పీహెచ్‌సీ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని తెలిపారు. అవసరమైన వివరాలను సేకరించి తదుపరి చర్యలపై పరిశీలన చేస్తామని పేర్కొన్నారు.



# శ్రీమతి తెలంగాణ పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, మహా :** శ్రీమతితెలంగాణ మహా అవార్డ్స్ ఈవెంట్, ఆడిషన్స్ కు సంబంధించిన పోస్టర్స్ ను ఎఎన్ఎన్ మీడియాగ్రూప్ సీఈవో కంది రామచంద్రా రెడ్డి, స్టార్ మహిళ ప్రోగ్రాం క్రియేటర్ సామా శ్రీధర్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. మిస్ క్వీన్ ఆఫ్ హైదరాబాద్ ఊహ, ఎస్వీమీడియా అధినేత ఉప్పల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి ఏఎన్ఎన్ మీడియా పార్ట్ నర్ గా వ్యవహరిస్తోంది. జిల్లాల వారీగా ఆడిషన్స్ నిర్వహించి జిల్లాల్లో ఉత్తమ శ్రీమతులను రాష్ట్రస్థాయి గ్రాండ్ ఫినాలేకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకురాలు ఊహ తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మహాపత్రిక న్యూస్ ఎడిటర్, నెట్ వర్క్ ఇన్ ఛార్జి కొత్త శ్రీనివాస రావు, అసోసియేట్ ఎడిటర్ గడల నరసింహారావు, హైదరాబాద్ సిటీ ఇన్ ఛార్జ్ భాస్కర్, వరంగల్ ఇన్ ఛార్జి శ్రీనాథ్, ఆదిలాబాద్ ఇన్ ఛార్జి సత్యనారాయణ తెలంగాణ లోని వివిధ జిల్లాల ఏఎన్ఎన్, మహా ప్రతినిధులు పాల్గొన్నారు.



# రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- రూ.11.42 లక్షల విలువైన రెండు రోవర్ల అందజేత

**వరంగల్, కలెక్టరేట్ మహా :** జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం అందించిన రెండు రోవర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత సర్వే బృందాలకు అందించారు.భూ రీసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, భూముల కొలతల్లో ఖచ్చితత్వాన్ని పెంచేందుకు ఆధునిక సర్వే పరికరాలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.రెండు రోవర్ల మొత్తం విలువ రూ.11.42 లక్షల విలువైన ఈ పరికరాల ద్వారా భూ రీసర్వే పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది.ఈ రోవర్స్ పంపిణీ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, సహాయ సంచాలకులు సర్వే మరియు రికార్డ్స్, ఆర్డీవో సుమ, డియార్వో విజయలక్ష్మి, తహసీల్దార్లు సంబధిత సర్వేలు ఉన్నారు.

# సేవా కార్యక్రమాలతో.. మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు..

మణుగూరు, మహా : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మణుగూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, బైక్ ర్యాలీ, రోగులకు పండ్ల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారు. తొలుత మండలంలోని సమితి సింగారం గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలందించాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పాల్గొని మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రి పొంగులేటి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. మంత్రి పొంగులేటి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**- ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ**

జన్మదిన వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బైక్ ర్యాలీ నిర్వహించారు. టపాసులు కాల్చి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ర్యాలీగా మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులను ఎమ్మెల్యే పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు పండ్లు పంపిణీ చేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా



ప్రధాన కార్యదర్శి పోలమూరి రాజు, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు, మహిళా నాయకులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# మాదక ద్రవ్యాలకు అందరూ దూరంగా ఉండాలి

## ఆరోగ్య వంతమైన యువతతోనే వికసిత్ భారత్–2047 సాధ్యం
## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**రంగల్, బొల్లికుంట, మహా :** భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, చదువుపై దృష్టిసారించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాల పై అవగాహన పై సందేశం ఇచ్చారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మెన్ బేతి అశోక్ బాబు, వైస్ చైర్మన్ శనబోయిన రాజ్‌కుమార్,సలహాదారులు ఈవీ శ్రీనివాసరావు, కోశాధికారి బొల్లం శివ, రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు నడెం శాంతి కుమార్, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ మండల పరశురాములు, తోట సంపత్ కుమార్, మామిడాల రమేష్ బాబు, డాక్టర్ రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, ముల్క ప్రసాద్, కళాశాల డైరెక్టర్లు సీహెచ్ వాణి, విశ్వాంబర్ రెడ్డి, అధ్యాపకులు, ఎండీ అజం, రియాజ్ తదితరులతో పాటు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, అవగాహన కల్పిస్తూ మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థిని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

# ఏఐతో మారనున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పని విధానం

- **ఉద్యోగుల పనితీరుకు ఫలితాలే కొలమానం.. టోకెన్ల వినియోగంతో పనితీరును అంచనా వేయొద్దని సూచన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:** కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రముఖ ఈకామర్స్ సంస్థ అమెజాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల పనితీరును అంచనా వేసే విధానంలో కీలక మార్పులకు ప్రాధాన్యం ఇస్తోంది. ఉద్యోగులు ఏఐ సాధనాలను ఎంత ఎక్కువగా ఉపయోగిస్తున్నారనే దానికంటే, వాటి ద్వారా వినియోగదారులకు ఎలాంటి ప్రయోజనం కల్పిస్తున్నారు, సంస్థకు ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నారు అనే అంశాలను ముఖ్యంగా పరిగణించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ల బాధ్యతలకు సంబంధించిన మార్గదర్శకాలను నవీకరించింది. ఏఐ సాధనాల వినియోగం, టోకెన్ల సంఖ్య, రూపొందించిన కోడ్ పరిమాణం, కోడ్ సమీక్షల సంఖ్య ఆధారంగా మాత్రమే ఉద్యోగుల సామర్థ్యాన్ని నిర్ణయించడం సరైన పద్ధతి కాదని అమెజాన్ పేర్కొంది. ఈ గణాంకాలను లక్ష్యాలుగా మార్చితే అవసరానికి మించి ఏఐ వినియోగం పెరిగి, సంస్థల ఖర్చులు అధికమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఏఐ ద్వారా ఉపయోగకరమైన ఫలితాలు సాధించకుండా, వినియోగ గణాంకాలను పెంచడానికే ప్రాధాన్యం ఇచ్చే విధానాన్ని 'టోకెన్‌మ్యాక్సింగ్'గా వ్యవహరిస్తున్నారు.

మరోవైపు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఏఐ సాంకేతికతను నేర్చుకుని తమ రోజువారీ పనుల్లో సమర్థంగా ఉపయోగించుకోవాలని సంస్థ సూచించింది. అయితే ఏఐ ప్రతి పనికీ ఉపయోగపడుతుందని భావించకూడదని, అవసరమైన సందర్భాల్లో మానవ విచక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపింది. సాంకేతిక నాయకులు కూడా ఏఐ సాధనాలను స్వయంగా ఉపయోగించి వాటి ప్రయోజనాలు, పరిమితులను అర్థం చేసుకోవాలని పేర్కొంది.కస్టమర్ల అవసరాలను అర్థం చేసుకుని, ఏఐ సహాయంతో నాణ్యమైన ఉత్పత్తులు రూపొందించే ఇంజినీర్లకు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం ఉంటుందని అమెజాన్ అభిప్రాయపడింది. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కారం, వ్యాపార అవగాహనను పెంచుకోవాలని సూచించింది. ఏఐ వినియోగం వల్ల నిజంగా ఉత్పాదకత పెరిగిందా, సేవల నాణ్యత మెరుగుపడిందా అనే అంశాలే విజయాన్ని నిర్ణయించాలని స్పష్టం చేసింది.




# స్టాక్ మార్కెట్‌కు నష్టాల దెబ్బ

- **ముడిచమురు ధరల పెరుగుదల.. అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి.. ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి**



**ముంబై, అక్టోబర్ 28:** దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాల పరంపర కొనసాగుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడిచమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాల ఒత్తిడి దేశీయ సూచీలపై ప్రభావం చూపుతున్నాయి. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 352 పాయింట్లు నష్టపోయి 73,246 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 50 పాయింట్లు తగ్గి 22,698 స్థాయికి చేరింది. మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు మదుపర్లలో ఆందోళన పెంచుతున్నాయి. ప్రపంచ ఆర్థిక పరిణామాలపై స్పష్టత లేకపోవడం, కంపెనీల ఆదాయ వృద్ధిపై నెలకొన్న సందేహాలు కూడా పెట్టుబడుల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి.

**ముడిచమురు ధరల సెగ**

అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన సవాలుగా మారుతోంది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 115 డాలర్ల స్థాయిని దాటడం మార్కెట్ వర్గాల్లో ఆందోళనకు కారణమైంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశాలు ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయి. భారత్ తన చమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. అంతర్జాతీయంగా ధరలు పెరిగితే దేశం చమురు దిగుమతుల కోసం ఎక్కువ విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించాల్సి వస్తుంది. ఫలితంగా దిగుమతి బిల్లు పెరిగి, రూపాయిపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంటుంది. రవాణా, ఉత్పత్తి, పంపిణీ ఖర్చులు పెరిగితే వస్తువులు, సేవల ధరలపై కూడా ప్రభావం పడవచ్చు. ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నప్పుడు వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గడంతో పాటు కంపెనీల లాభాలపైనా ఒత్తిడి ఏర్పడుతుంది. ఈ పరిణామాలన్నీ మార్కెట్ అంచనాలను బలహీనపరుస్తున్నాయి.

**ఐటీ షేర్లలో అమ్మకాల జోరు**

దేశీయ మార్కెట్లో టెక్నాలజీ రంగానికి చెందిన ప్రముఖ కంపెనీల షేర్లు కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టెక్ మహీంద్రా వంటి ఐటీ కంపెనీల షేర్లలో అమ్మకాలు కనిపించాయి. అమెరికా ఆర్థిక పరిస్థితులు, అక్కడి కంపెనీల సాంకేతిక వ్యయాలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు ఐటీ సంస్థల భవిష్యత్తు ఆదాయాలపై చర్చకు దారితీస్తున్నాయి. అమెరికా మార్కెట్లలో టెక్నాలజీ షేర్లలో చోటుచేసుకునే మార్పులు భారత ఐటీ కంపెనీలపైనా ప్రభావం చూపుతాయి. ఎందుకంటే దేశీయ ఐటీ సంస్థలకు అమెరికా కీలక వ్యాపార మార్కెట్‌గా ఉంది. అక్కడి సంస్థలు ఖర్చులను తగ్గించడం లేదా కొత్త ప్రాజెక్టులపై నిర్ణయాలను వాయిదా వేయడం వంటి చర్యలు తీసుకుంటే భారత ఐటీ కంపెనీల ఆదాయ అంచనాలు మారవచ్చు. ఇప్పటికే మంచి లాభాల్లో ఉన్న షేర్లను విక్రయించి లాభాలు స్వీకరించే మదుపర్లు కూడా అమ్మకాల ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది.

**అమెరికా వడ్డీ రేట్లపై ఉత్కంఠ**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల విధానంపై నెలకొన్న అనిశ్చితి అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రభావితం చేస్తోంది. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గకపోతే వడ్డీ రేట్ల కోత ఆలస్యం కావచ్చనే అంచనాలు పెట్టుబడిదారుల్లో జాగ్రత్త ధోరణిని పెంచుతున్నాయి. అమెరికా బాండ్లపై రాబడులు ఆకర్షణీయంగా మారితే అంతర్జాతీయ పెట్టుబడిదారులు అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులను తగ్గించి, అమెరికా ఆస్తులవైపు మళ్లే అవకాశం ఉంటుంది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత మార్కెట్లో షేర్లను విక్రయిస్తే సూచీలపై ఒత్తిడి పెరుగుతుంది. అయితే విదేశీ పెట్టుబడుల ప్రవాహం ఒక్క అంశంపైనే ఆధారపడదు. కంపెనీల ఆదాయాలు, దేశీయ ఆర్థిక వృద్ధి, రూపాయి మారకం విలువ, ప్రపంచ మార్కెట్ల పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

**మదుపర్లు అప్రమత్తంగా ఉండాలి**

స్టాక్ మార్కెట్లో స్వల్పకాలిక హెచ్చుతగ్గులు సహజమే అయినప్పటికీ, అంతర్జాతీయ అనిశ్చితి పెరిగిన సమయంలో పెట్టుబడుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. మార్కెట్ పడిపోతోందనే భయంతో తొందరపడి షేర్లను విక్రయించడం, లేదా ధరలు తగ్గాయని పరిశీలన లేకుండా పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. కంపెనీల ఆర్థిక ఫలితాలు, అప్పుల స్థాయి, భవిష్యత్తు ఆదాయ సామర్థ్యం, షేరు విలువ వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలి. పెట్టుబడులను ఒకే రంగానికి పరిమితం చేయకుండా విభజించడం కూడా ప్రమాదాన్ని నియంత్రించడంలో తోడ్పడుతుంది. స్వల్పకాలంలో మార్కెట్ ఏ దిశగా కదులుతుందో ఖచ్చితంగా అంచనా వేయడం కష్టం. అందువల్ల పెట్టుబడిదారులు తమ ఆర్థిక లక్ష్యాలు, పెట్టుబడి కాలవ్యవధి, నష్టాలను భరించే సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలి. ముడిచమురు ధరలు, అమెరికా వడ్డీ రేట్లపై స్పష్టత, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల త్రైమాసిక ఫలితాలు రానున్న రోజుల్లో మార్కెట్ కదలికలను ప్రభావితం చేసే కీలక అంశాలుగా నిలవనున్నాయి.



# ఎక్స్‌ప్రెస్‌వేలపై స్పీడ్ చలాన్లకు మినహాయింపా?

**120 కి.మీ. వేగంపై గడ్కరీ వ్యాఖ్యలు.. ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ వినియోగం**

**న్యూఢిల్లీ:** ఎక్స్‌ప్రెస్‌వేలపై వాహనాల వేగ పరిమితులు, ట్రాఫిక్ చలాన్ల జారీపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వాహనాలకు చలాన్లు జారీ చేయకుండా చూడాలని, వేగ పరిమితికి సంబంధించి 20 శాతం వరకు మినహాయింపు ఇవ్వాలని సూచించినట్లు వెల్లడించారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కార్యక్రమంలో రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణపై మాట్లాడిన సందర్భంగా ఈ అంశాలను ప్రస్తావించారు. ఎక్స్‌ప్రెస్‌వేలపై వేగ పరిమితులు వాహనాల రకాన్ని బట్టి మారుతాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దిష్ట ఎక్స్‌ప్రెస్‌వేలపై కార్లకు గరిష్ఠ వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్లుగా ఉంది. అయితే మంత్రి వ్యాఖ్యలను అన్ని రహదారులు, అన్ని వాహనాలకు వర్తించే సాధారణ అనుమతిగా భావించకూడదు. అధికారిక మార్గదర్శకాలు, రహదారిపై ఏర్పాటు చేసిన వేగ సూచికలను తప్పనిసరిగా పాటించాలి. రహదారులపై ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతికతను ఉపయోగించాల్సిన అవసరం ఉందని గడ్కరీ పేర్కొన్నారు. లేన్ క్రమశిక్షణ ఉల్లంఘనలు, ప్రమాదకర డ్రైవింగ్‌ను గుర్తించడం ద్వారా రహదారి భద్రతను మెరుగుపరచవచ్చని తెలిపారు. వాహనదారులు చలాన్లపై మాత్రమే కాకుండా తమ భద్రతపై కూడా దృష్టి పెట్టాలని, నిర్దేశిత వేగ పరిమితులను పాటించాలని సూచించారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి కానుక

- **డీఏ 3 శాతం పెంపు**
- **63 శాతానికి చేరిన అలవెన్స్!**
- **మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం**

**న్యూఢిల్లీ, మహా** : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పండుగ వేళ కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. 7వ వేతన సంఘం కింద ఉద్యోగులకు ఇచ్చే డీఏ, పెన్షనర్లకు ఇచ్చే కరువు భత్యం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ కీలక ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. తాజా నిర్ణయంతో ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ ఒకేసారి 63 శాతానికి ఎగబాకింది. పెరిగిన నూతన రేట్లు 2026 జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ పెంపు ద్వారా కేంద్ర ఖజానాపై ఏటా దాదాపు రూ.10,016 కోట్ల అదనపు భారం పడనుందని ప్రభుత్వం అంచనా వేసింది.

**48 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి**

ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 48 లక్షల మంది కేంద్ర ఉద్యోగులు, 68 లక్షల మంది పెన్షనర్లకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది. ఉద్యోగి మూల వేతనం ఆధారంగా ఈ పెంపు ఉంటుంది. ఉదాహరణకు నెలకు రూ.18,000 కనీస మూల వేతనం తీసుకునే ఉద్యోగికి డీఏ నెలకు రూ.540 పెరిగి, ఏడాదికి రూ.6,480 అదనంగా అందుతుంది. అలాగే రూ.30,000 మూల వేతనం ఉన్నవారికి నెలకు రూ.900, రూ.40,000 బేసిక్ పే ఉన్నవారికి నెలకు రూ.1,200 అదనంగా లభిస్తాయి.

# బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు

- **కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?**
- **మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్**

**న్యూఢిల్లీ, మహా** : నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ



కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

# స్మిత్ మచ్చర్ కు యూఏఈ సలాం

- **విమాన హైజాక్ యత్నాన్ని అడ్డుకున్న భారత పైలట్‌కు అరుదైన గౌరవం**
- **ఆర్డర్ ఆఫ్ జాయెద్ II, ఫస్ట్ క్లాస్ పురస్కారాన్ని ప్రదానం చేసిన**
- **ఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్**



**న్యూఢిల్లీ, మహా :** విమానాన్ని హైజాక్ చేసేందుకు జరిగిన ప్రయత్నాన్ని ధైర్యంగా ఎదుర్కొని, 172 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిన ఫ్లైదుబాయ్ విమాన సిబ్బందికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని అందించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారత పైలట్ స్మిత్ మచ్చర్ సహా విమాన సిబ్బందికి 'ఆర్డర్ ఆఫ్ జాయెద్ II, ఫస్ట్ క్లాస్' పురస్కారాన్ని యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ప్రదానం చేశారు. మంగళవారం అబుదాబిలో జరిగిన కార్యక్రమంలో ఈ గౌరవాన్ని అందించారు.సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్ జడ్1073లో ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా 29 ఏళ్ల ఒమన్‌కు చెందిన కోపైలట్ హమ్మామ్ అల్ హమ్మామీ.. అత్యవసర గొడ్డలితో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడి చేసినట్లు సమాచారం. విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దాడిలో కెప్టెన్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో విమానం ఒక్క నిమిషం కంటే తక్కువ సమయంలో సుమారు 17 వేల అడుగుల ఎత్తు నుంచి దిగివచ్చింది. తీవ్ర గాయాలున్నప్పటికీ కెప్టెన్ మచ్చర్ కాక్‌పిట్ తలుపు తెరవగలిగారు. తిరుగు ప్రయాణం కోసం అదే విమానంలో ఉన్న మరో పైలట్ యాక్సెస్ కోడ్ సాయంతో కాక్‌పిట్‌లోకి ప్రవేశించారు. క్యాబిన్ సిబ్బంది, పలువురు ప్రయాణికుల సహకారంతో దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో పైలట్, ఆయనతో ఉన్న కోపైలట్ విమాన నియంత్రణను చేపట్టి సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో మొత్తం 172 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నట్లు ఫ్లైదుబాయ్ వెల్లడించింది. భారత పైలట్‌కు ప్రత్యేక గుర్తింపు ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు తొలుత తబుక్‌లో చికిత్స అందించారు. అనంతరం ఆయనను అబుదాబిలోని ఆసుపత్రికి తరలించారు. అక్టోబర్ 3న దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.మంగళవారం అబుదాబిలో జరిగిన కార్యక్రమంలో యూఏఈ అధ్యక్షుడు మచ్చర్ భుజంపై చేయి వేసి పలకరించిన దృశ్యాలు విడుదలయ్యాయి. విమాన సిబ్బంది చూపిన అప్రమత్తత, వృత్తిపరమైన నైపుణ్యాన్ని యూఏఈ నాయకులు ప్రశంసించారు. ప్రజల ప్రాణాలు, భద్రతను కాపాడటం దేశ అత్యున్నత ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూఏఈ ఉపాధ్యక్షుడు, ప్రధానమంత్రి, దుబాయ్ పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్, దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**ఉగ్రదాడికి కుట్ర చేసినట్లు దర్యాప్తులో వెల్లడి**

యూఏఈ అటార్నీ జనరల్ హమద్ సైఫ్ అల్ షంసీ అక్టోబర్ 9న ఈ ఘటనను ఉగ్రవాద చర్యకు ప్రయత్నంగా అభివర్ణించారు. 2001 సెప్టెంబర్ 11 దాడుల నుంచి ప్రేరణ పొంది, ముందస్తు ప్రణాళికతో నిందితుడు పైలట్ వృత్తిని ఎంచుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. టెల్ అవీవ్‌లోని బెన్ గురియన్ విమానాశ్రయ ప్రయాణికుల టెర్మినల్‌ను విమానంతో ఢీకొట్టి, ఆత్మాహుతి దాడి ద్వారా అత్యధిక ప్రాణనష్టం కలిగించాలనేది నిందితుడి లక్ష్యంగా ఉందని విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. నిందితుడు తాను ఒంటరిగానే వ్యవహరించినట్లు అంగీకరించినప్పటికీ, ఈ కుట్రకు సంబంధించి ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశంతో పాటు అన్ని కోణాల్లో న్యాయపరమైన విచారణ కొనసాగుతోంది.

**ప్రధాని మోదీ ప్రశంసలు**

భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలో కెప్టెన్ మచ్చర్‌ను 'హీరో'గా అభివర్ణించారు. ఈ ఘటనలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఆరుగురు ఇజ్రాయెల్ ప్రయాణికులకు ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ పౌర ధైర్య పురస్కారాలను అందించారు. కోలుకున్న తర్వాత భారత పైలట్‌కు కూడా అదే గౌరవాన్ని అందజేస్తామని ప్రకటించారు. ఘటన జరిగిన రోజున విమానంలోని ప్రయాణికులను ప్రత్యామ్నాయ ఫ్లైదుబాయ్ విమానంలో తబుక్ నుంచి ఇజ్రాయెల్‌కు తరలించారు. ఈ ఘటనకు ముందు టెల్ అవీవ్‌కు రోజుకు పది వరకు విమాన సర్వీసులు నడిపిన ఫ్లైదుబాయ్, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇజ్రాయెల్‌కు రాకపోకలను తదుపరి ప్రకటన వచ్చే వరకు నిలిపివేసింది. విమానాన్ని హైజాక్ చేసే ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో భారత పైలట్ సహా సిబ్బంది చూపిన ధైర్యసాహసాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి.

# డీపీడీపీ చట్టంతో జర్నలిస్టుల స్వేచ్ఛకు ఎలాంటి ముప్పు లేదు

**న్యూఢిల్లీ, మహా :** డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం2023 వల్ల జర్నలిస్టుల స్వేచ్ఛకు ఎలాంటి ముప్పు వాటిల్లదని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం స్పష్టం చేశారు. మీడియా స్వేచ్ఛా వార్తలు నివేదించే సామర్థ్యాన్ని బలహీనపరిచే నిబంధన ఏదీ ఈ చట్టంలో లేదని ఆయన హామీ ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛకు ఈ చట్టం పూర్తి భద్రత కల్పిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డీఎన్‌పీఏ) ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసిన నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ చట్టంలో జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు లేకపోవడం వల్ల వార్తా సేకరణకు ఆటంకం కలుగుతుందని, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుందని, పౌరుల సమాచార హక్కు బలహీనపడుతుందని డీఎన్‌పీఏ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందించాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రాన్ని ఆదేశించింది.మీడియా సంస్థల ఆందోళనలపై స్పందించిన వైష్ణవ్, చట్టం రూపకల్పన ప్రక్రియను వివరించారు. "ప్రైవసీని ప్రాథమిక హక్కుగా గుర్తించిన సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే ఈ చట్టాన్ని రూపొందించాం. పత్రికా స్వేచ్ఛను ప్రభావితం చేయాలనే ఉద్దేశం కూడా ప్రభుత్వానికి లేదు. చట్టం రూపకల్పనకు ముందు నెల రోజుల పాటు విస్తృతమైన ప్రజా సంప్రదింపులు జరిపాం. ఇందులో పరిశ్రమ వర్గాలు కూడా పాలుపంచుకున్నాయి. చట్టంలో ఎక్కడా జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగించే అంశం లేదు" అని ఆయన తెలిపారు. మీడియా సంస్థల ఆందోళనలను తోసిపుచ్చుతూ.. వార్తా కథనానికి సంబంధించిన వ్యక్తి నుంచి రిపోర్టర్ ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పే నిబంధన ఏదీ ఈ చట్టంలో లేదని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా, కథనానికి సంబంధించిన వార్తా మూలాలను (సోర్స్) వెల్లడించాలని బలవంతం చేసే క్లాజ్ కూడా ఇందులో లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు.

# స్పెయిన్‌లో ఘోర ప్రమాదం

- **రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొని 46 మంది దుర్మరణం!**
- **మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారుల వెల్లడి**

**ఇంటర్నెట్ డెస్క్, మహా :** స్పెయిన్‌లోని టోలెడో సమీపంలో బుధవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. రెండు ప్రయాణికుల హైస్పీడ్ రైళ్లు బలంగా ఢీకొన్న దుర్ఘటనలో 46 మంది అక్కడికక్కడే మరణించగా.. దాదాపు 300 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల సమయంలో రెన్ఫే, ఇరియో సంస్థలకు చెందిన రెండు రైళ్లు మోరా, ఓర్గాజ్ పట్టణాల మధ్య ఒకదానికొకటి వేగంగా ఢీకొన్నాయి. ఈ భయానక ధాటికి ఇరియో రైలుకు చెందిన రెండు బోగీలు పట్టాలు తప్పి తుక్కుతుక్కయ్యాయి. బోగీల శకలాలు ట్రాక్‌పై చెల్లాచెదురుగా పడిపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రమాద తీవ్రత చూస్తుంటే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని స్థానిక మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. సమీపంలోని ఉర్దా మేయర్ మాన్యుయెల్ గాలన్ ఆదేశాలతో క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు స్థానిక స్పోర్ట్స్ హాల్‌ను తాత్కాలిక వైద్య శిబిరంగా మార్చారు. ఈ ఘోర ప్రమాదం కారణంగా మాడ్రిడ్ నుంచి దక్షిణ అండలూసియా ప్రాంతాన్ని కలిపే హైస్పీడ్ రైలు మార్గాన్ని రైల్వే ఆపరేటర్ ఆదిఫ్ పూర్తిగా నిలిపివేసింది. ప్రమాదానికి గల సాంకేతిక కారణాలపై అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు.



## మెజెంటా డ్రెస్‌లో మాళవిక మెరుపులు



మలయాళ నటి మాళవిక సి. మీనన్ తన అందం, అభినయంతో పాటు స్టైలిష్ ఫొటోషూట్లతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా మెజెంటా రంగు దుస్తుల్లో పూల్ సైడ్ వద్ద ఆమె దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. ట్రెండీ లుక్‌లో కనిపించిన మాళవిక తన ప్రత్యేకమైన ఫ్యాషన్ శైలితో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. మెజెంటా రంగు దుస్తులు ఆమె రూపానికి మరింత ఆకర్షణను తీసుకురాగా, సహజమైన చిరునవ్వు, అందమైన హావభావాలు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూల్ సైడ్ వాతావరణానికి తగినట్లుగా ఆమె ఎంచుకున్న దుస్తులు, స్టైలింగ్ ఫొటోషూట్‌కు కొత్త అందాన్ని తీసుకొచ్చాయి. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా ఆధునిక ఫ్యాషన్‌లోనూ తాను ప్రత్యేకమని మాళవిక ఈ ఫొటోలతో మరోసారి చాటిచెప్పారు. సినిమాలతో బిజీగా ఉంటూనే సోషల్ మీడియా ద్వారా అభిమానులకు దగ్గరగా ఉండే ఆమె, తన తాజా ఫొటోలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విశేషాలను ఎప్పటికప్పుడు పంచుకుంటుంటారు. ఆమె కొత్త ఫొటోలు వెలువడిన ప్రతిసారీ అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. ముఖ్యంగా ఫ్యాషన్‌పై ఆసక్తి ఉన్నవారికి మాళవిక ఎంచుకునే దుస్తులు, వాటికి అనుగుణంగా చేసే స్టైలింగ్ ఆకర్షణగా నిలుస్తుంటాయి. కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో కనిపించడం ఆమె ఫొటోషూట్లలో మరో ప్రత్యేకత. ఈసారి మెజెంటా రంగు దుస్తుల్లో పూల్ సైడ్ అందాల మధ్య కనిపించిన మాళవిక ఫొటోలు కూడా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. నటిగా విభిన్న పాత్రలు పోషిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు.

## మారిపోయిన 'గేమ్ ఛేంజర్' కథ!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు శంకర్ కలయికలో తెరకెక్కిన 'గేమ్ ఛేంజర్' సినిమా కథ వెనుక ఆసక్తికర విషయాలను రచయిత, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ వెల్లడించారు. ఈ చిత్రానికి మూలకథ అందించిన ఆయన, తాను మొదట అనుకున్న కథకు, తెరపైకి వచ్చిన సినిమాకు చాలా తేడా ఉందని తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కార్తీక్ సుబ్బరాజ్ తన అసలు కథా ఆలోచనను వివరించారు. ఒక సాధారణ ఐఏఎస్ అధికారి రాజకీయ వ్యవస్థలోకి ప్రవేశించి, దానిలో మార్పులు తీసుకురావడానికి ప్రయత్నించే కథగా దీన్ని రూపొందించాలని భావించానన్నారు. వ్యవస్థలోని లోపాలు, రాజకీయ పరిణామాలు, అధికారుల బాధ్యతలను సహజత్వానికి దగ్గరగా చూపించాలనుకున్నట్లు తెలిపారు. హిందీ చిత్రం 'న్యూటన్' తరహాలో వాస్తవికతకు ప్రాధాన్యమిస్తూ కథను రాసుకున్నానని చెప్పారు. తమిళనాడులోని మదురై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ అంశాలను కూడా జోడించాలని అనుకున్నట్లు వెల్లడించారు. అయితే అప్పట్లో తాను 'మహాన్' సినిమా పనుల్లో బిజీగా ఉండటంతో పూర్తి స్క్రీన్‌ప్లే రాయలేకపోయానని, కేవలం మూలకథను మాత్రమే శంకర్‌కు అందించానని వివరించారు. ఆ తర్వాత రామ్‌చరణ్ వంటి స్టార్ హీరో, భారీ బడ్జెట్ కలవడంతో కథ స్వరూపం మారిందని అభిప్రాయపడ్డారు. తాను అనుకున్న వాస్తవిక కథ కాస్తా, శంకర్ తనదైన శైలిలో భారీ యాక్షన్, కమర్షియల్ అంశాలతో కూడిన చిత్రంగా మలిచారని తెలిపారు. కథలో మార్పులు జరిగినప్పటికీ, శంకర్ వంటి ప్రముఖ దర్శకుడు తన కథను ఎంచుకుని సినిమాగా తెరకెక్కించడం ఆనందంగా ఉందని కార్తీక్ సుబ్బరాజ్ పేర్కొన్నారు. 'గేమ్ ఛేంజర్'లో రామ్‌చరణ్ ఐఏఎస్ అధికారిగా కనిపించగా, రాజకీయ వ్యవస్థలో అవినీతికి వ్యతిరేకంగా పోరాడే అంశాలు కథలో ప్రధానంగా నిలిచాయి. కార్తీక్ సుబ్బరాజ్ తాజాగా చేసిన వ్యాఖ్యలతో సినిమా అసలు కథ ఎలా ఉండేదనే అంశంపై మరోసారి చర్చ మొదలైంది.




## ప్రేక్షకులు షాక్ అవుతారు!

జ్యోతి పూర్వజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'కిల్లర్' సినిమా ఆసక్తికర అంశాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో పూర్వజ్ మరో కీలక పాత్రలో నటించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. ఎ. పద్మనాభరెడ్డితో కలిసి సినిమాను నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. తాజాగా నిర్వహించిన మీడియా సమావేశంలో పూర్వజ్ సినిమా కథాంశం, అందులోని ప్రత్యేకతలను వెల్లడించారు. 'కిల్లర్' ఒక మహిళా ప్రధాన చిత్రమని, ఇందులో జ్యోతి పూర్వజ్ ఉగ్రవాది, వ్యాంపైర్, గూఢచారి వంటి విభిన్న పాత్రల్లో కనిపిస్తారని తెలిపారు. మనిషి మెదడుతో యంత్రాలను అనుసంధానించే సాంకేతికతకు సంబంధించిన పరిశోధనలను ఆధారంగా చేసుకుని ఈ సినిమా కథను రూపొందించినట్లు చెప్పారు. ఎలాన్ మస్క్ న్యూరల్ లింక్ ద్వారా యంత్రాలకు, మనిషి మెదడుకు మధ్య అనుసంధానంపై పరిశోధనలు చేస్తున్నారని, అలాంటి సాంకేతికతను మనిషిపై ప్రయోగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో తమ సినిమా తెరకెక్కిందని వివరించారు. ఈ చిత్రంలో తాను శాస్త్రవేత్తగా, పోలీసు అధికారిగా నటించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా ద్వితీయార్థంలో వచ్చే కీలక మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుందని పూర్వజ్ అన్నారు. సినిమా కథలోని ఆ ట్విస్ట్‌ను ముందుగా చెప్పిన వారికి కోటి రూపాయల బహుమతి ఇస్తామని ప్రకటించినట్లు తెలిపారు. ఈ నెల 29న రాత్రి 10 గంటలకు ప్రీమియర్ ప్రదర్శనలు ప్రారంభమవుతాయని, రాత్రి 11 గంటలకు కథలోని ట్విస్ట్‌ను గుర్తించినవారు వాట్సాప్ ద్వారా సమాధానం పంపించాలని సూచించారు. ముందుగా సరైన సమాధానం పంపిన విజేత పేరును సినిమా విజయోత్సవ వేడుకలో ఎల్ఈడీ తెరపై ప్రదర్శిస్తామని చెప్పారు. విభిన్నమైన కథాంశం, ఉత్కంఠభరితమైన మలుపులతో రూపొందిన 'కిల్లర్' ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



## గ్లామరస్ లుక్‌లో ఆషికా రంగనాథ్

దక్షిణాది సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి ఆషికా రంగనాథ్ తన అందం, అభినయంతో పాటు ఫ్యాషన్ ఫొటోషూట్లతోనూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె చేసిన గ్లామరస్ ఫొటోషూట్ నెట్టింట ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆధునిక దుస్తులు, ఆకర్షణీయమైన స్టైలింగ్‌తో ఆషికా సరికొత్త లుక్‌లో కనిపిస్తూ అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంటున్నారు. కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో పోజులిస్తూ తన ప్రత్యేకమైన శైలిని ప్రదర్శిస్తున్నారు. దుస్తులకు తగిన మేకప్, హెయిర్‌స్టైల్, ఆభరణాల ఎంపిక ఆమె రూపానికి మరింత అందాన్ని తీసుకొస్తున్నాయి. సంప్రదాయ దుస్తుల్లో ఎంత అందంగా కనిపిస్తారో, ఆధునిక ఫ్యాషన్ దుస్తుల్లోనూ అంతే ఆకర్షణీయంగా కనిపిస్తూ తనలోని విభిన్న కోణాలను ఆషికా ఆవిష్కరిస్తున్నారు. ఆమె ఫొటోలను చూసిన అభిమానులు తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. కన్నడ చిత్ర పరిశ్రమలో నటిగా ప్రయాణాన్ని ప్రారంభించిన ఆషికా, క్రమంగా తెలుగు, తమిళ చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుంటూ తన పరిధిని విస్తరించుకున్నారు. 'క్రేజీ బాయ్' సినిమాతో కథానాయికగా పరిచయమైన ఆమె, 'రాంబో 2', 'మధగజ', 'అమిగోస్', 'నా సామిరంగ' వంటి చిత్రాలతో గుర్తింపు సంపాదించుకున్నారు. ముఖ్యంగా నాగార్జునతో కలిసి నటించిన 'నా సామిరంగ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న పాత్రల్లోనూ తన ప్రతిభను నిరూపించుకోవాలని ఆమె ప్రయత్నిస్తున్నారు. సినిమాలతో పాటు ఫొటోషూట్ల ద్వారా కూడా అభిమానులను అలరిస్తున్న ఆషికా, తన ఫ్యాషన్ ఎంపికలతో యువతకు ఆకర్షణగా నిలుస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ ఫొటోషూట్ చిత్రాలు ఆమె స్టైలిష్ లుక్‌ను మరోసారి చాటిచెబుతున్నాయి.



## కుటుంబమే మనకు బలం: త్రివిక్రమ్

కుటుంబ బంధాలు, ఆప్యాయతలు, మనుషుల మధ్య సంబంధాల గురించి తనదైన శైలిలో వివరించే దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, 'ఆదర్శ కుటుంబం' సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో చేసిన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్నారు. కుటుంబం అనేది మన జీవితంలో ఎంతో కీలకమైనదని, ఎన్ని సమస్యలు ఎదురైనా మనకు అండగా నిలిచేది కుటుంబమేనని ఆయన పేర్కొన్నారు. కుటుంబ విలువలు, బంధాల గొప్పతనాన్ని ప్రేక్షకులకు మరోసారి గుర్తుచేశారు. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్‌తో కలిసి పనిచేయడం తనకు ప్రత్యేకమైన అనుభవమని త్రివిక్రమ్ తెలిపారు. తన సినీ ప్రయాణంలో వెంకటేష్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, రచయితగా తాను పనిచేసిన తొలి చిత్రాల్లో 'పవిత్ర బంధం' ఒకటని చెప్పారు. 'పెళ్లి చేసుకుందాం' సినిమా సమయంలోనూ వెంకటేష్ తనను ప్రోత్సహించారని వెల్లడించారు. 'నువ్వు నాకు నచ్చావ్' కథ చెప్పిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, కథ విన్న వెంటనే వెంకటేష్ సినిమా చేయడానికి అంగీకరించడం తన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచిందని వివరించారు. కుటుంబ కథా చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వెంకటేష్‌ను త్రివిక్రమ్ ప్రశంసించారు. కుటుంబమే ఆయన బలం, కుటుంబ ప్రేక్షకులే ఆయన విజయానికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. 'ఆదర్శ కుటుంబం'లో చిట్టిబాబు, స్వర్ణ, సంపూర్ణ, సర్వ అనే పాత్రలు తమ కుటుంబాన్ని కాపాడుకోవడానికి చేసే ప్రయత్నాలే కథకు ప్రధానాంశమని తెలిపారు. ఒక సాధారణ వ్యక్తి తన కుటుంబం కోసం ఎంత దూరమైనా వెళ్లగలడనే విషయాన్ని ఈ సినిమా చూపిస్తుందని చెప్పారు. ప్రస్తుత సమాజంలో మనుషుల మధ్య విభేదాలు, వివాదాలు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబ బంధాల ప్రాధాన్యం మరింత పెరిగిందని త్రివిక్రమ్ అభిప్రాయపడ్డారు. కుటుంబం ఒక పద్మవ్యూహం వంటిదని, అందులో చిక్కుకోకుండా సమస్యలను ఎదుర్కొని విజయం సాధించడం ఎంత ముఖ్యమో ఈ చిత్రం వివరిస్తుందని అన్నారు. కుటుంబ విలువలను తన సినిమాల ద్వారా ప్రేక్షకులకు చేరవేయడం ఎప్పుడూ ఇష్టమని పేర్కొన్నారు. ఈ చిత్రంలో నటించిన నటీనటులు, పనిచేసిన సాంకేతిక నిపుణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్రివిక్రమ్ ప్రసంగం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది.



## 'దొంగ నా కొడుకు' నుంచి తొలి పాట

టాలీవుడ్‌లో కొత్త సినిమా పాటల సందడి మొదలైంది. 'దొంగ నా కొడుకు' చిత్రానికి సంబంధించిన తొలి పాట 'ఓ మై గాడ్' విడుదలైంది. సినిమా ప్రమోషన్లలో భాగంగా విడుదల చేసిన ఈ పాట ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినిమా పేరులోనే వైవిధ్యాన్ని చూపించిన చిత్రబృందం, తొలి పాటతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేసింది. సంగీతం, గానం, సాహిత్యం సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. సినిమా కథకు అనుగుణంగా పాటలను రూపొందించడం ప్రేక్షకులను చిత్రానికి మరింత చేరువ చేసే అంశం. ఈ నేపథ్యంలో 'ఓ మై గాడ్' పాట సినిమాపై ఆసక్తిని పెంచుతుందని చిత్రబృందం ఆశిస్తోంది. సాధారణంగా సినిమా విడుదలకు ముందు పాటలను విడుదల చేయడం ద్వారా ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతుంటారు. ముఖ్యంగా తొలి పాటకు లభించే స్పందన సినిమా ప్రచారానికి ఉపయోగపడుతుంది. 'దొంగ నా కొడుకు' చిత్రానికి సంబంధించి ఈ పాట ఎలాంటి ఆదరణ పొందుతుందో చూడాలి. పాట విడుదలతో సినిమా ప్రచార కార్యక్రమాలు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. ప్రేక్షకుల స్పందన, పాటకు వచ్చే ఆదరణ చిత్రబృందానికి కీలకంగా మారనున్నాయి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com